మా కలం.. మీ గళం..

# మన గళం

దిన పత్రిక

RNI : APTEL/ 2017/74310

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ  పబ్లిషర్ : నగరూరు రాఘవేంద్ర  సంపుటి : 08  సంచిక : 218  శుక్రవారం  13 - 02 - 2026  పేజీలు: 8  వెల: 4

**భక్తులందరికీ ప్రశాంత మల్లన్న దర్శనం**



3లో..

## ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లకు శాశ్వత మౌలిక

# సదుపాయాలు కల్పిస్తాం

- నిధుల సమీకరణకు ప్రత్యేక చర్యలు
- నూజివీడు, అరకు, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లకు భారీ అంచనాలు
- పుట్టపర్తిలో కొత్త క్యాంపస్‌పై పరిశీలన
- మంత్రి నారా లోకేశ్



మన గళం, అమరావతి : రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటీ (ఆర్జీయూకేటీ) క్యాంపస్‌లలో పూర్తిస్థాయి, శాశ్వత మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర విద్య, సమాచార సాంకేతిక శాఖ మంత్రి నారా లోకేశ్ శాసనసభలో స్పష్టం చేశారు. క్యాంపస్‌ల అభివృద్ధికి అవసరమైన నిధుల సమీకరణ కోసం ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని తెలిపారు. నిధుల కోసం ఇప్పటికే ఆర్థిక శాఖ మంత్రితో చర్చలు జరిపినట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "సాస్కీ" పథకం ద్వారా నిధులు పొందేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. ఇందుకోసం సవివర ప్రాజెక్టు నివేదికలను సిద్ధం చేస్తున్నామని, కేంద్రం నుంచి వీలైనంత ఎక్కువ నిధులు రాబట్టడమే లక్ష్యమని వివరించారు. నూజివీడు క్యాంపస్‌లో మిగిలిన పనులు పూర్తి చేయడానికి రూ.60 కోట్లు, అరకు వ్యాలీ క్యాంపస్‌కు రూ.40 కోట్లు అవసరమని అంచనా వేశామని తెలిపారు. ఒంగోలు క్యాంపస్‌కు రెండు దశల్లో కలిపి రూ.600 కోట్లు, శ్రీకాకుళం క్యాంపస్‌కు సుమారు రూ.300 కోట్ల వరకు అవసరమవుతాయని వెల్లడించారు. ప్రస్తుతం శాశ్వత భవనాలు లేక విద్యార్థులు తాత్కాలిక అకాడమీల కోసం వేర్వేరు జిల్లాలకు వెళ్లాల్సి వస్తోందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఏ జిల్లాలో ట్రిపుల్ ఐటీ చదువుతున్న విద్యార్థులు అక్కడే తమ కోర్సును పూర్తి చేసే విధంగా శాశ్వత సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇదే సందర్భంగా పుట్టపర్తిలో కొత్త ట్రిపుల్ ఐటీ ఏర్పాటు చేసే అంశంపై ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి అడిగిన ప్రశ్నకు స్పందించిన మంత్రి, ఈ ప్రతిపాదనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని సభకు హామీ ఇచ్చారు.



## జాహ్నవి కుటుంబానికి

# రూ.262 కోట్ల పరిహారం

- అమెరికాలో రోడ్డు ప్రమాదంలో మృతి
- 29 మిలియన్ డాలర్ల ఒప్పందానికి సియాటెల్ అంగీకారం
- పోలీసు అధికారి నిర్లక్ష్యంపై తీవ్ర విమర్శలు

2 లో..

## ప్రముఖ వార్తా వాచకురాలు

# సరళా మహేశ్వరి కన్నుమూత

- దూరదర్శన్‌లో హిందీ వార్తలకు ప్రత్యేక గుర్తింపు



2 లో..

# విజయం..యలమంజుల బాలాజీదే

- న్యాయవాదుల సంక్షేమం, శ్రేయస్సు తన గెలుపుతోనే.. సాధ్యం
- న్యాయవాదుల ఏకగ్రీవ.. తీర్మానం



(మన గళం,కర్నూలు లీగల్) : కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు, మదనపల్లి, రాయలసీమ జిల్లాల్లో,విజయవాడ, గుంటూరు , అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు బాలాజీ యలమంజుల గెలుపుకోసం అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారు . అడుగడుగునా న్యాయవాదులు బాలాజీ యలమంజుల కి నీరాజనాలతో బ్రహ్మరథం పట్టారు . బాలాజీ యలమంజుల గెలుపు తోనే న్యాయవాదులకు భద్రత , భవిష్యత్తు ఉంటుందని, కర్నూలు జిల్లాలో హైకోర్టు బెంచ్ త్వరలో వస్తుందని,,న్యాయవాదుల చట్టం వస్తుందనే అభిప్రాయాలను ఆనందోత్సాహాల నడుమ పలువురు న్యాయవాదులు వ్యక్తపరచారు. బాలాజీ యలమంజుల గెలుపుతో న్యాయవాదులకు ఒక భరోసా ఏర్పడటం ఖాయమని వారు చెప్పారు. సీనియర్ న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు బాలాజీ యలమంజుల గెలుపు తథ్యమంటూ ఆశీర్వచనాలు అందిస్తున్నారు . కొత్త వారిని ప్రోత్సహించటానికి ఆంధ్రప్రదేశ్ న్యాయవాదులు సిద్ధంగా వున్నారని , హైకోర్టు ప్రభుత్వ న్యాయవాది బాలాజీ యలమంజుల లాంటి సీనియర్ న్యాయవాది సేవలు న్యాయవాదులు భద్రతకు - భవిష్యత్ కు ఎంతో అవసరం వుందని అడుగడుగునా సహచర న్యాయవాదులు కితాబులతో బాలాజీ యలమంజుల గొప్పతనాన్ని శ్లాఘించారు. న్యాయవాదుల భవిష్యత్ , భద్రతే ప్రధాన లక్ష్యంగా అవిశ్రాంతంగా కృషి చేస్తానని,తన జీవితాన్ని న్యాయవాదుల అభ్యున్నతి కోసమే అంకితం చేస్తానని బాలాజీ యలమంజుల పలు సందర్భాల్లో తెలియచేసారని, బాలాజీ యలమంజుల నంబర్ 15 ప్రక్కన వా చీ జు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అఖండ విజయాన్ని అందిస్తారని, న్యాయవాద బృందం , మహిళా న్యాయవాద బృందం ఆశీర్వదిస్తారన్న ఆశాభావాన్ని --

ప్రజా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు,న్యాయవాది కె.బలరాం వ్యక్తం చేశారు.

యలమంజుల...ఘనచరిత :

1) ల్యాండ్ టైటిల్ యాక్ట్ మొదట కేసు వేసిన గొప్ప వ్యక్తి, ఆయన, తన చొరవతోనే ల్యాండ్ టైటిల్ యాక్ట్ కాల గర్భంలో కలిసి పోయింది.

2) ప్రజా ప్రయోజనాల సంబంధించిన 300 కేసులు పిల్ వేసి విజయం సాధించింది తానే.

3) తిరుమల తిరుపతి దేవస్థానంలో గత ప్రభుత్వం కమిటీ సభ్యులు 87 సభ్యులు వేస్తే, హైకోర్టు లో పిల్ వేసి 25 సభ్యులు మాత్రమే పంపండని తనవల్లే ఆదేశాలు జారీ అయ్యాయి.

4)న్యాయవాద వృత్తికి బలాన్ని చేకూర్చింది..తానే.

5) కర్నూలు జిల్లాలో హైకోర్టు బెంచ్ త్వరలో వస్తుంది. అక్కడ న్యాయవాదులకు మాత్రమే వసతి కోసం,న్యాయవాదులకు మాత్రమే బంగ్లా ఏర్పాటు కోసం ఆయన కృషి చేస్తారు.

6)న్యాయవాదుల సంక్షేమం కోసం, కుటుంబ సభ్యులకు ఇన్సూరెన్స్ పాలసీ తీసుకురావాలనే తపన ఆయనది.

7)న్యాయవాదులకు గౌరవం ఉండే విధంగా కృషి చేస్తారు.

8)న్యాయవాదులకు మాత్రమే వసతి గృహాల ఏర్పాటుకు కృషి చేస్తారు.

## రఫేల్ యుద్ధవిమానాల కొనుగోలుకు


# కేంద్రం ఆమోదం

- రూ.3.25 లక్షల కోట్ల భారీ రక్షణ ఒప్పందానికి గ్రీన్ సిగ్నల్
- ఫ్రాన్స్ నుంచి 114 యుద్ధవిమానాల కొనుగోలు నిర్ణయం



మన గళం, న్యూఢిల్లీ : ఆపరేషన్

2 లో..



# జాహ్నవి కుటుంబానికి రూ. 262 కోట్ల పరిహారం


మన గళం, న్యూఢిల్లీ : అమెరికాలో పోలీసు అధికారి నిర్లక్ష్యంతో మృతి చెందిన కర్నూలుకు చెందిన జాహ్నవి కందుల (23) కుటుంబానికి 29 మిలియన్ డాలర్ల పరిహారం ఇవ్వడానికి సియాటెల్ నగరం ఒప్పందం కుదుర్చుకుంది. ఇది భారత కరెన్సీలో సుమారు రూ. 262 కోట్లకు సమానం. 2023 జనవరి 23న సియాటెల్‌లో రోడ్డు దాటుతున్న సమయం లో పోలీసు పెట్రోలింగ్ వాహనం ఢీకొట్టడంతో జాహ్నవి మరణించారు. సియాటెల్ నగర న్యాయవాది ఎరికా ఇవాన్స్ ఈ పరిహారంపై ప్రకటన విడుదల చేశారు. జాహ్నవి మృతి చాలా బాధాకరమని, ఈ పరిహారం ఆమె కుటుంబానికి కొంత ఉపశమనం కలిగిస్తుందని పేర్కొన్నారు. అయితే ఈ ఒప్పందంపై జాహ్నవి కుటుంబం నుంచి ఇంకా స్పందన రావాల్సి ఉంది. ఇరుపక్షాలు గత వారం కోర్టులో పరిహార ఒప్పందానికి సంబంధించిన దరఖాస్తు దాఖలు చేసినట్లు సమాచారం. జాహ్నవి సౌత్ లేక్ యూనియన్ ప్రాంతంలోని నార్త్ ఈస్ట్రన్ యూనివర్సిటీలో మాస్టర్స్ డిగ్రీ కోసం 2021లో అమెరికా వెళ్లారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో వాహనాల వేగ పరిమితి 40 కిలోమీటర్లుగా ఉండగా, సంబంధిత పోలీసు అధికారి 119 కిలోమీటర్ల వేగంతో వాహనం నడిపినట్లు వెల్లడైంది. ఢీకొట్టిన దెబ్బకు జాహ్నవి సుమారు 100 అడుగుల దూరం ఎగిరిపడినట్లు నివేదికలు సూచించాయి. ప్రమాదం అనంతరం పోలీసు అధికారి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఈ వ్యాఖ్యలపై భారత్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో పాటు అమెరికాలోనూ వ్యతిరేకత వ్యక్తమైంది. అనంతరం సంబంధిత అధికారిని విధుల నుంచి తొలగించినట్లు అధికారులు వెల్లడించారు.

# రఫేల్ యుద్ధవిమానాల కొనుగోలుకు కేంద్రం ఆమోదం



సింధూర్ సమయంలో పాకిస్థాన్‌కు వణుకు పుట్టించిన రఫేల్ యుద్ధవిమానాల సంఖ్యను పెంచుకోవాలని భారత్ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఫ్రాన్స్ దేశం నుంచి అదనంగా యుద్ధవిమానా లను కొనుగోలు చేసే ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రూ. 3.25 లక్షల కోట్ల వ్యయంతో ఫ్రాన్స్‌తో భారీ రక్షణ ఒప్పందం కుదుర్చు కునేందుకు అనుమతి లభించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడిం చాయి. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని రక్షణ కొనుగోలు మండలి 114 రఫేల్ యుద్ధవిమానాల కొనుగోలుకు ఆమోదం తెలిపింది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ ఈ నెల 18న భారత పర్యటనకు రానున్న నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది. కొనుగోలు చేయనున్న 114 యుద్ధవిమానాల్లో 88 ఒకే సీటు వేరియంట్లు, 26 రెండు సీట్ల వేరియంట్లు ఉంటాయి. ఇప్పటికే భారత వాయుసేన వద్ద 36 రఫేల్ యుద్ధవిమానాలు సేవలో ఉన్నాయి. దేశీయ తయారీకి ప్రాధాన్యం ఇస్తూ ఈ ఒప్పందాన్ని అమలు చేయనున్నారు. రఫేల్ తయారీ సంస్థ డసో ఏవియేషన్ భారతదేశంలోని ప్రైవేటు సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకుని తయారీ, అసెంబ్లీ కార్యకలాపాలు చేపట్టే అవకాశముందని సమాచారం. దీంతో దేశ రక్షణ సామర్థ్యం మరింత బలోపేతం కానుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

# ప్రముఖ వార్తా వాచకురాలు సరళా మహేశ్వరి కన్నుమూత



మన గళం డెస్క్ : దూరదర్శన్‌లో హిందీ వార్తలు చదివిన ప్రముఖ యాంకర్ సరళా మహేశ్వరి కన్నుమూశారు. ఆమె వయసు 71 సంవత్సరాలు. ఆమె మృతి పట్ల దూరదర్శన్ సంస్థ నివాళి అర్పించింది. భారతీయ వార్తా ప్రపంచంలో ఆమెకు ప్రత్యేక స్థానం ఉందని పేర్కొంది. సరళమైన కంఠం, స్పష్టమైన ఉచ్చారణ, హుందాతనంతో హిందీ వార్తలను చదివి ప్రేక్షకులను ఆకట్టుకున్నారని గుర్తుచేసింది. సరళా మహేశ్వరి 1976లో దూరదర్శన్‌లో వార్తా ప్రకటనకర్తగా చేరారు. 1982లో పూర్తి స్థాయి వార్తా వాచకురాలిగా బాధ్యతలు స్వీకరించారు. అదే ఏడాది ఆసియా క్రీడలు, 1991లో రాజీవ్ గాంధీ హత్య వంటి కీలక ఘటనలను కవర్ చేశారు. పంజాబ్‌లో ఉగ్రవాద హింస చెలరేగిన సమయంలో కూడా ఆమె వార్తలు చదివి గుర్తింపు పొందారు. హిందీ భాషపై పట్టు, తేలికైన చీర కట్టు, స్థిరమైన శైలి ఆమె ప్రత్యేకతగా నిలిచాయి. ఆ కాలంలో ప్రత్యక్ష ప్రసారాల్లో వార్తలు చదివిన యాంకర్‌గా ఆమెకు ప్రత్యేక గుర్తింపు ఉంది. 1984 తరువాత బ్రిటన్‌లోని బీబీసీలో కూడా వార్తా వాచకురాలిగా పనిచేశారు. 1988లో తిరిగి దూరదర్శన్‌లో చేరి సేవలందించారు. 2005లో దూరదర్శన్‌కు రాజీనామా చేసిన సరళా మహేశ్వరి, వార్తా రంగంలో తన ముద్రను చిరస్థాయిగా నిలిపారు. ఆమె మరణంతో భారతీయ ప్రసార రంగం ఒక ప్రతిభావంతురాలిని కోల్పోయింది.

# తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో వైయస్ జగన్ మోహన్ రెడ్డి అధ్యక్షతన సమీక్ష సమావేశం



( ఆలూరు మనగళం): ఆంధ్రప్రదేశ్, తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాల నేపథ్యంలో అనుసరించాల్సిన వ్యూహంపై సభ్యులకు దిశా నిర్దేశం. శాసనసభలో మన గొంతు వినిపించకూడదని ప్రభుత్వ కుట్ర అందుకే ఏకైక ప్రతిపక్ష పార్టీ అయినా ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించడం లేదు మండలిలో మంచి సంఖ్యా బలం ఉంది, అక్కడ ప్రజా సమస్యలపై గట్టిగా గొంతెత్తాలి. ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నించాలి: ఎమ్మెల్సీలకు వైయస్ జగన్ దిశా నిర్దేశించారు. లడ్డూ ప్రసాదం విషయంలో చంద్రబాబు ఒక అబద్ధాన్ని సృష్టించి దానికి రెక్కలు కట్టారు వైయస్సార్‌సీపీపై నిరంతరం బురద జల్లుతూ దుష్ప్రచారం చేస్తున్నారు. లడ్డూ వ్యవహారంలో సమాధానం చెప్పాల్సింది, తిరుమల శ్రీవారికి మరియు ప్రజలకు క్షమాపణ చెప్పాల్సిందీ చంద్రబాబే. చంద్రబాబు హయాంలోనే ట్యాంకర్ల సరఫరా రిజెక్ట్ అయినా నెయ్యి మళ్లీ టీటీడీలోకి వచ్చిందీ చంద్రబాబు హయాంలోనే సీబీఐ సిట్ ఛార్జిషీటుకు సమాధానం చెప్పాల్సింది చంద్రబాబె అని వైయస్ జగన్ స్పష్టం చేశారు.

**కూటమి ప్రభుత్వ పాలనలో స్కామ్‌ల మయం:** విశాఖలో రూ. 5 వేల కోట్ల భూమిని చంద్రబాబు తన బంధువుకు కట్టబెట్టారు గతంలో ఏనాడూ, రాష్ట్రంలో అలా జరగలేదు. ఏ ముఖ్యమంత్రి ఇలా బరితెగించలేదు వీటన్నింటినీ మండలిలో గట్టిగా నిలదీయాలి: పార్టీ శాసనసభా పక్ష సమావేశం నిర్వహించిన వైయస్ జగన్. శాసనసభ, మండలి బడ్జెట్ సమావేశాల సందర్భంగా తాడేపల్లి వైయస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్ రెడ్డి సమావేశమయ్యారు. సభలో అనుసరించాల్సిన వ్యూహంపై ఆయన మండలి సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా శ్రీ వైయస్ జగన్ మాట్లాడుతూ, ప్రజల తరఫున గొంతు వినిపించకూడదనే ప్రధాన ప్రతిపక్షంగా వైయస్సార్‌సీపీని గుర్తించడం లేదు. అందరూ యుద్ధంలో ఉన్నారు. నా కంటే మీకే ఇంకా బాగా తెలుసు. అందుకే మీరు కూడా బెటర్‌గా పోరాడతారు. మనకు అసెంబ్లీలో బలం తక్కువ. అక్కడ మన గొంతు వినపడకూడదన్న సంకల్పంతో ప్రభుత్వం ఉంది. సభలో ఉన్న ఏకైక ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రమే. అయినా ప్రధాన ప్రతిపక్షంగా గుర్తింపు ఇవ్వడం లేదు. ఎందుకంటే, మనకు ఆ గుర్తింపును ఇస్తే, విపక్షనేతకు కూడా సీఎంకు ఎంత సమయం ఇస్తారో దాదాపుగా సమయం మాట్లాడే అవకాశం ఇవ్వాల్సి వస్తుంది. అలా ఇవ్వడం ఇష్టం లేదు కాబట్టే, మన పార్టీని ప్రధాన ప్రతిపక్షంగా గుర్తించడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజా సమస్యలపై గొంతెత్తలేం కాబట్టి, ఇక్కడ మీడియాతో మాట్లాడుతున్నాం. ఆధారాలతో సహా, అన్నీ వివరిస్తున్నాం. మండలిలో మనకు బలం ఉంది. కాబట్టి మనకు మాట్లాడే అవకాశం వస్తుంది. మనకు మైక్ ఇస్తారు కాబట్టి, ప్రజల సమస్యలను గట్టిగా వినిపించే వీలుంది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ మీకు తెలుసు. సబ్జెక్టుల వారీగా పూర్తి అవగాహన పెంచుకోండి. అప్పుడే మనం గట్టిగా మాట్లాడగలం. దేనికైనా మంచి ప్రిపరేషన్ అవసరం. అవగాహన పెంచుకుంటే బాగా మాట్లాడగలుగుతాం. ఏ అంశంపై మాట్లాడినా తగిన ఆధారాలు, సాక్ష్యాలు చూపి మాట్లాడాలి. అప్పుడే మన గొంతు బలంగా పోతుంది. లడ్డూ వ్యవహారంపై ప్రశ్నించడాన్ని చంద్రబాబు తట్టుకోలేకపోతున్నారు. అంబటి రాంబాబు, జోగిరమేష్ ఇళ్లపై దాడులు, విడదల రజినమ్మ, బొల్లా బ్రహ్మనాయుడు, భూమన కరుణాకర్‌రెడ్డిపై దాడులు కానీ, కాకాణి గోవర్ధన్ రెడ్డిపై అక్రమ కేసులు.. ఇవన్నీ కూడా లడ్డూ వ్యవహారంలో ప్రశ్నించడాన్ని తట్టుకోలేక చంద్రబాబు చేసినవే. చివరకు చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని మనం గుళ్లలో పూజలు చేసినా, చంద్రబాబు తట్టుకోలేకపోతున్నారు. ఏకంగా భౌతిక దాడులు చేస్తున్నారు. ఒక అబద్ధం సష్టించి, దానికి రెక్కలు కట్టి ప్రచారం చేయడం తొలిసారి చూస్తున్నాం. అసలు కల్తీ నెయ్యి సరఫరాకు, వైయస్సార్‌సీపీకి ఏమాత్రం సంబంధం లేదు.

**సీబీఐ ఛార్జిషీటుకు సమాధానం చెప్పాల్సిందీ, చేసిన తప్పులకు క్షమాపణ చెప్పాల్సింది చంద్రబాబే:** లడ్డూ వ్యవహారానికి సంబంధించిన పరిణామాలను ఒకసారి చూస్తే. ఈ వ్యవహారంలో ఆరోపణలకు సమాధానం చెప్పాల్సింది చంద్రబాబే. లెంపలేసుకోవాల్సిందీ చంద్రబాబే. ఒకసారి జరిగిన తీరు చూస్తే, రాష్ట్రంలో మార్చి 16, 2024న ఎన్నికల కోడ్ వస్తే, మే 13న, పోలింగ్ జరిగింది. మే 15న టీటీడీలో నెయ్యి సరఫరాకు సంబంధించిన టెండర్లు ఓకే చేసి, ఏఆర్ డెయిరీకి కాంట్రాక్ట్ ఇచ్చారు. జూన్ 4, ఎన్నికల ఫలితాలు వచ్చాయి, ప్రభుత్వం మారింది. చంద్రబాబు సీఎం అయిన తర్వాతనే నెయ్యి సరఫరా ప్రారంభమైంది. జూన్ 12, 20, 25 జూలై 4న మొత్తం నాలుగు ట్యాంకర్లను ఏఆర్ డెయిరీ సరఫరా చేసింది. అవన్నీ ల్యాబ్ పరీక్షల్లో పాస్ అయ్యాయి. ఆ తర్వాత జూలై 6, 12 తేదీల్లో వచ్చిన నాలుగు ట్యాంకర్లు నెయ్యి నాణ్యత పరీక్షలో ఫెయిల్ కావడంతో వెనక్కి పంపారు. జూలై 23న ల్యాబ్ రిపోర్టు రావడంతో, జూలై 25న నాలుగు ట్యాంకర్లను వెనక్కు పంపించారు. అయితే ఆ ట్యాంకర్లను జూలై 27న శ్రీకాళహస్తిలో వైష్ణవి డెయిరీకి సమీపంలో పార్క్ చేశారు. ఆ తర్వాత అవే ట్యాంకర్లు మరో డెయిరీ పేరుతో ఆగస్టు, సెప్టెంబరులో తిరిగి టీటీడీకి పంపారు. అలా వచ్చిన నెయ్యిని వాడారని, సీబీఐ ఛార్జ్‌షీట్‌లో కూడా రాసింది. వెనక్కి పంపిన ట్యాంకర్లు తిరిగి టీటీడీలోకి వస్తే, జరిగిన పరిణామాలు, జరిగిన తేదీలు చూస్తే మొత్తం ఇవన్నీకూడా చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాతనే జరిగాయి. మరి సమాధానం చెప్పాల్సింది చంద్రబాబే కదా నిజానికి 201419 మధ్య ప్రీమియర్ డెయిరీ నెయ్యి సరఫరా చేసింది. ఆ కంపెనీ 2019లో సరఫరా ఆపేసింది. కానీ, దాన్ని కేవలం మన ప్రభుత్వానికి ఆపాదిస్తున్నారు. అంతకు ముందు సరఫరాకు సంబంధించి ప్రస్తావించడం లేదు.



**టీటీడీలో నెయ్యి సప్లైపై ఒక పక్కా విధానం:** టీటీడీలో నెయ్యి సేకరణకు టీటీడీలో ఒక పటిష్ఠ విధానం ఉంది. నెయ్యి తెచ్చిన ట్యాంకర్లు కేంద్ర ప్రభుత్వం అక్రిడిటెడ్ ల్యాబ్ నుంచి సర్టిఫికెట్ తీసుకురావాలి. అలా వచ్చిన ట్యాంకర్‌లోని నెయ్యిని మళ్లీ టీటీడీ కూడా పరీక్షిస్తుంది. ఆ రిపోర్టు కూడా పాజిటివ్‌గా ఉంటేనే, లోపలికి పంపిస్తారు. ఇదే పద్ధతిలో నాణ్యత లేక మన హయాంలో 18 సార్లు ట్యాంకర్లు వెనక్కి పంపాం. అంతకు ముందు చంద్రబాబు హయాంలో కూడా 201419 మధ్య 15 ట్యాంకర్లు వెనక్కి పంపారు. మరి ఇలాంటి పద్ధతి ఉన్నప్పటికీ కూడా దొడ్డిదారిన రిజెక్ట్ చేసినవి, తిరిగి టీటీడీకి వచ్చాయంటేం, దానికి సమాధానం చెప్పాల్సింది చంద్రబాబే కదా? మరి వీటన్నింటినీ మన పార్టీకి, మన ప్రభుత్వ కాలానికి ఆపాదించి రోజూ బురదజల్లుతున్నారు.

**201419 మధ్య కూడా అభియోగాలు ఎదుర్కొంటున్న కంపెనీలు నెయ్యి సరఫరా:** సీబీఐ ఛార్జిషీటులో అభియోగాలు ఎదుర్కొంటున్న కంపెనీలు 201419 మధ్య కూడా సప్లై చేశాయి. ప్రీమియర్ డెయిరీ 2016, 2017, 2018లో కూడా నెయ్యిని సప్లై చేసింది. కానీ, కేవలం మన ప్రభుత్వానికి ఆపావాదించి కుట్రలు చేస్తున్నారు.

**కూటమి ప్రభుత్వం స్కామ్‌ల మయం:** మరోవైపు కూటమి ప్రభుత్వం స్కామ్‌ల మయంగా మారింది. ఎక్కడికక్కడ యథేచ్ఛగా దోపిడి చేస్తున్నారు. రూ. 5 వేల కోట్ల విలువైన భూమి 54 ఎకరాలు గీతమ్ వర్సిటీకి ఇచ్చేశారు. ఏ ముఖ్యమంత్రీ తన సొంత బంధువులకు ఎవరూ ఇలా ఇచ్చుకోలేదు. ఇప్పుడు ఈ ప్రభుత్వంలో కొత్త నినాదం వినిపిస్తోంది. అదే క్యాష్.. సూట్‌కేసు.. రాజేష్.. లోకేష్.. ఇది బాగా వినిపిస్తోంది. ఈ అంశాలన్నింటిపైనా సభలో గట్టిగా గొంతు వినిపించాలి. పోరాడాలి. చిత్తశుద్ధితో కష్టపడి పని చేయండి. కళ్లు మూసి తెరిచేలోపు మూడేళ్లు గడుస్తాయి. వచ్చేది మన ప్రభుత్వమే. ఇప్పుడు కష్టపడి పని చేస్తున్న వారందరికీ, తగిన గుర్తింపు ఉంటుంది. పనితీరు ఆధారంగా మీకు మీ పదవులు తిరిగి వస్తాయి కూడా. అలాగే ఇంతకన్నా మంచి పదవులు కూడా దక్కే అవకాశం మీకు ఉందని వైయస్ జగన్ ఎమ్మెల్యేలకు వివరించారు.

# రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాల సమర్పణ

మనగళం శ్రీశైలం : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భాన్ని పురస్కరించుకొని శ్రీశైల మహా పుణ్యక్షేత్రంలో గురువారం సాయంత్రం దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలను ఘనంగా సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శ్రీశైలం క్షేత్రం దేశవ్యాప్తంగా విశిష్ట స్థానం కలిగిన శైవక్షేత్రమని, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాల సమర్పణ చేయడం ఆనందంగా ఉందన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలానికి భారీగా తరలివస్తున్న భక్తులకు అన్ని విధాలా సౌకర్యాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం, దేవస్థానం సమన్వయంతో చర్యలు కొనసాగిస్తున్నట్లు కలెక్టర్ మంత్రికి వివరించారు. ఆలయ ఏర్పాట్లు, భక్తులకు అందిస్తున్న సదుపాయాలపై మంత్రికి వివరాలు అందజేశారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా, స్థానిక శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి, దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.





# భక్తులందరికీ ప్రశాంత మల్లన్న దర్శనం

- భక్తుల రద్దీకి తగ్గట్లు సమగ్ర సదుపాయాలు
- ఫిబ్రవరి 13 నుండి16 తేదీల్లో టోల్‌గేట్ రుసుము మినహాయింపు
- 24 గంటల ప్రయాణ రాకపోకలకు అనుమతి
- జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా



మనగళం శ్రీశైలం : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విస్తృత స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించి, భక్తులు ప్రశాంతంగా స్వామి, అమ్మవార్ల దర్శనం చేసుకునేలా అన్ని చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. గురువారం దేవస్థానం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్‌తో కలిసి ఆమె పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన నాటి నుండి ఇప్పటివరకు 2,59,050 మంది భక్తులు స్వామి, అమ్మవార్ల దర్శనం చేసుకున్నారని తెలిపారు. నిన్న ఒక్కరోజే 69 వేల మంది భక్తులు దర్శనం చేసుకోగా, బుధవారం రాత్రి శివస్వాములు అధిక సంఖ్యలో దర్శనానికి హాజరయ్యారని చెప్పారు. నడకదారిన కైలాస మార్గం ద్వారా అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకున్నారని వివరించారు. రానున్న రెండు రోజుల్లో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్నందున అదనపు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు కల్పిస్తున్న సదుపాయాలను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన సూచనలు జారీ చేస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. పాతాళగంగ వద్ద పుణ్యస్నానాల కోసం వచ్చే భక్తులకు స్నాన ఘట్టాల వద్ద సమగ్ర సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 75 వేల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు వెల్లడించారు. దుస్తులు మార్చుకునే గదులు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, పారిశుధ్య చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీటి సదుపాయాలు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. రవాణా సౌకర్యాల విషయమై ప్రతి ఐదు నిమిషాలకు ఒకసారి నంద్యాల – శ్రీశైలం మార్గంలో బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. మహాశివరాత్రి రోజున ఏపీఎస్ఆర్టీసీ తరఫున 1,800 బస్సులు, తెలంగాణ రాష్ట్రం నుండి 1,000 బస్సులు, ఇతర ప్రాంతాల నుండి మొత్తం 3,000 బస్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ బస్సుల కోసం ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలు గుర్తించి, పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా పోలీసు, అటవీ శాఖ, దేవస్థానం మరియు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పటిష్ట ప్రణాళిక అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి 13, 14, 15, 16 తేదీల్లో టోల్ గేట్ల వద్ద రుసుము మినహాయింపు కల్పించినట్లు ప్రకటించారు. రాత్రివేళల్లో కూడా నిరంతర రవాణా సౌకర్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. జంతు సంరక్షణలో భాగంగా అటవీ ప్రాంతంలో వాహనదారులు గంటకు 30 కి.మీ. వేగ పరిమితిని పాటించాలని విజ్ఞప్తి చేశారు. రాత్రి ప్రయాణాల్లో భద్రతా దృష్ట్యా ఒకేసారి పది వాహనాలను కాన్వాయ్ రూపంలో అనుమతించే విధంగా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. నడకదారిలో వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్లాస్టిక్ నిషేధం నేపథ్యంలో రెండు, ఐదు లీటర్ల ప్లాస్టిక్ బాటిళ్లకు అనుమతి లేకపోవడంతో అటవీ శాఖ అనుమతి పొంది బుధవారం మధ్యాహ్నం నుండి అర్థ లీటర్ నీటి బాటిళ్లను తీసుకురావడానికి అనుమతి కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. భక్తుల క్యూలైన్లలో తాగునీటి సదుపాయంతో పాటు చిన్నారులకు పాలు, బిస్కెట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మహాశివరాత్రి రోజున సుమారు 1.50 లక్షల మంది భక్తులు విశ్రాంతి తీసుకునేలా అదనపు చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. గురువారం ఒక్కరోజే 71 వేల మంది భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా భక్తులు మరింత సౌకర్యవంతంగా, ప్రశాంతంగా దర్శనం చేసుకునేలా అన్ని ఏర్పాట్లు కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు, భద్రతా ఏర్పాట్లకు భక్తులు సహకరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.




## కమాండ్ కంట్రోల్ రూమ్‌లో టెలికాం సేవలపై సమీక్ష




- భక్తులకు నిరంతర ఫోన్, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

మనగళం శ్రీశైలం : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీశైల క్షేత్రానికి భారీగా భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో, కమ్యూనికేషన్ సేవలు అంతరాయం లేకుండా ఉండేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సెల్ ఫోన్ టవర్ సంస్థల ప్రతినిధులను సూచించారు. గురువారం శ్రీశైల దేవస్థానం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ గారితో కలిసి బిఎస్ఎన్ఎల్ అధికారులు, వివిధ సెల్ ఫోన్ టవర్ సంస్థల ప్రతినిధులు, ఫైబర్ నెట్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే రెండు, మూడు రోజుల్లో సుమారు మూడు లక్షల మంది భక్తులు శ్రీశైలానికి రానున్న నేపథ్యంలో, ఫోన్ కాల్స్ మరియు ఇంటర్నెట్ వినియోగం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని... భక్తులకు ఎటువంటి సిగ్నల్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా రద్దీ ప్రాంతాలు, క్యూలైన్లు, దేవస్థానం పరిసరాలు, ఆర్టీసీ బస్టాండ్, పార్కింగ్ ప్రదేశాలు, నడకదారి మార్గాలలో సిగ్నల్ ఫ్రీక్వెన్సీని పెంచి అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. తాత్కాలిక మొబైల్ టవర్‌లు (మొబైల్ బూస్టర్ యూనిట్లు) ఏర్పాటు చేయడం, ప్రస్తుత టవర్ల సామర్థ్యాన్ని పెంపొందించడం, ఫైబర్ నెట్ కనెక్షన్లను సమర్థవంతంగా నిర్వహించడం వంటి అంశాలపై అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి కాల్ డ్రాప్స్, నెట్‌వర్క్ జామ్ సమస్యలు లేకుండా 24 గంటల మానిటరింగ్ వ్యవస్థను అమలు చేయాలని సూచించారు. భక్తుల సౌకర్యం దృష్ట్యా సేవలలో ఎలాంటి జాప్యం ఉండకూడదని, ఏ సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరించే విధంగా ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచాలని టెలికాం సంస్థల ప్రతినిధులకు కలెక్టర్ స్పష్టం చేసారు. జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ గారు మాట్లాడుతూ, అత్యవసర సేవలు, పోలీస్ కంట్రోల్ రూమ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యల సమన్వయం కోసం నిరంతర కమ్యూనికేషన్ అత్యంత కీలకమని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు కమ్యూనికేషన్ వ్యవస్థ బలోపేతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో దేవస్థానం అధికారులు, టెలికాం విభాగ సిబ్బంది, ఫైబర్ నెట్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## చిప్పగిరి మద్యం దుకాణానికి రీ టెండర్




- రీ టెండర్ కోసం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం.
- ఆసక్తి ఉన్నవారు టెండర్ లో పాల్గొనవచ్చు... సీఐ లలితదేవి.



(ఆలూరు మనగళం): ఆలూరు నియోజకవర్గ పరిధిలోని చిప్పగిరి మద్యం దుకాణం ( ఏ4 వైన్స్ షాప్ ) లైసెన్స్ కొరకు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆలూరు ప్రొహిబిషన్ & ఎక్సైజ్ సీఐ లలితాదేవి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ చిప్పగిరిలోని మద్యం దుకాణం ఏ4 కు రీ టెండర్ల ద్వారా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. దీని కొరకు అప్లికేషన్ ఫీజు 2 లక్షలు (తిరిగి చెల్లించారు), ఈనెల 12/2/2026 నుండి 21/2/2026 సాయంత్రం 5:00 గంటల వరకు టెండర్లు నిర్వహిస్తారు. అనంతరం 23/2/2026 తేదిన లాటరీ ద్వారా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 8:00 గం, నుండి లాటరీ పద్ధతిలో ఎవరికి వచ్చింది అనే సమాచారం ఇస్తారు. ఆసక్తి ఉన్నవారు టెండర్ లో పాల్గొనవచ్చని ఆలూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ బి.లలితాదేవి వివరించారు.

## శ్రీశైలం నందు ప్రశాంత వాతావరణంలో భక్తుల దర్శన ఏర్పాట్లు...

- శివరాత్రి రోజు సుమారు 1,50,000 పైన భక్తులు వస్తారని అంచనా....
- భక్తులకు సౌకర్యాలతో పాటు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగింది.....



మనగళం శ్రీశైలం : నంద్యాల జిల్లాలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీశైలం నందు జరుగుచున్న మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని వారికి ఇలాంటి సౌకర్యం కలుగకుండా ఏర్పాటు చేయడంతో పాటు పటిష్ట భద్రత చర్యలు తీసుకోవడం జరిగిందని జిల్లా ఎస్పీ గారు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ నిన్నటి దినం అనగా 11 తేదీ బుధవారం సుమారు 63,596 మంది భక్తులకు ప్రశాంత వాతావరణంలో దర్శనాలు ఏర్పాటు చేయడం జరిగింది .వీరిలో 14,803 మంది శివ భక్తులు ఎలాంటి ఆటంకాలు లేకుండా స్పర్శ దర్శనం చేయడం జరిగింది. నేడు మధ్యాహ్నం 12 గంటలకు సుమారు 30,149 మంది దర్శనం చేసుకోగా వారిలో 11,515 మంది శివ భక్తులు ఉన్నారు. నిన్నటి దినం కైలాస ద్వారం నుండి సుమారుగా 26,000 మందికి పైగా భక్తులు కాలినడకన శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకోవడానికి రావడం జరిగిందని వారికి అసౌకర్యం లేకుండా వైద్య సేవలతో పాటు ఆహారము నీళ్లు మొదలగు సౌకర్యాలు కల్పించడం జరిగింది. శివరాత్రి పర్వదినం రోజున అనగా 15 వ తేదీన సుమారు 1,50,000 మంది కన్నా ఎక్కువ భక్తులు వచ్చే అవకాశం ఉందని వారికి అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు శాంతిభద్రతలకు భంగం కలగకుండా సరిపడా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయడం జరిగింది.స్నానఘట్టాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు బోట్లను గజ ఈతగాలను కూడా ఏర్పాటు చేయడం జరిగింది. ట్రాఫిక్ అంతరాయం లేకుండా బస్సులకు మరియు కార్లకు రింగ్ రోడ్డు వద్ద ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేయడం జరిగింది. భక్తులు ఇతరులకు ఇబ్బంది లేకుండా తమ వాహనాలను పోలీసు వారి సూచనలతో పార్కింగ్ ప్రదేశాలలో మాత్రమే నిలుపుకోవాలని రోడ్డుకు ఇరువైపులా ఎట్టిపరిస్థితులలో వాహనాలు నిలుపరాదని విజ్ఞప్తి చేయడం జరుగుతుంది.

## మందకృష్ణ మాదిగ సభను విజయవంతం చేయండి



మన గళం కోడుమూరు: మహా జననేత బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి అలుపెరుగని పోరాట యోధుడు వర్గీకరణ సాధకుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ, కర్నూల్ జిల్లా, మంత్రాలయం నియోజకవర్గం, కౌతాళం మండలం, హాల్వి గ్రామంలో శుక్రవారం ఉదయం 11గంటలకు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, ఎంఎస్పి రాష్ట్ర నాయకులు ఆంధ్రయ్య ఒక ప్రకటనలో పిలుపు నిచ్చారు. వర్గీకరణ అనంతరం మొదటి సారిగా మందకృష్ణ మాదిగ జిల్లాకు వస్తున్న సందర్భంగా జిల్లా లో ఉన్నటువంటి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, ఎంఈఎఫ్, ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాల నాయకులు అత్యధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజవంతం చేయవలసిందిగా కోరడమైనది.

## పాతాళగంగ స్నాన ఘట్టాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ పరిశీలన





మనగళం శ్రీశైలం : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలానికి భారీగా తరలివస్తున్న భక్తుల సౌకర్యార్థం పాతాళగంగ వద్ద ఏర్పాటు చేసిన స్నాన ఘట్టాలను గురువారం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై సమగ్రంగా ఆరా తీశారు. స్నాన ఘట్టాల వద్ద పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరుగుతోందా లేదా, టాయిలెట్లు పరిశుభ్రంగా ఉన్నాయా, రన్నింగ్ వాటర్ అందుబాటులో ఉందా అనే అంశాలను స్వయంగా పరిశీలించారు. దుస్తులు మార్చుకునే గదులు శుభ్రంగా ఉంచుతున్నారా ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించారా అనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే, భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని నియమించిన గజ ఈతగాళ్లు (లైఫ్ గార్డులు) ఎంతమంది ఉన్నారు, వారు విధుల్లో నిరంతరం అందుబాటులో ఉన్నారా అనే విషయంపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన కోసం అవసరమైన భద్రతా ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పరిశుభ్రమైన వాతావరణంలో సురక్షితంగా స్నానాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు. పారిశుధ్య సిబ్బంది నిరంతరం విధుల్లో ఉండి పరిశుభ్రతను కాపాడాలని, తాగునీటి సరఫరా నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. భక్తుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా సమన్వయంతో పనిచేసి, అన్ని మౌలిక సదుపాయాలను పర్యవేక్షిస్తూ ఉండాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు.

# కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన లేబర్ కోడ్లను రద్దు చేయాలి

**- కార్మిక ప్రజా సంఘాల డిమాండ్**

మన గళం కోడుమూరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన లేబర్ కోడ్లను రద్దు చేయాలి కార్మిక ప్రజా సంఘాల డిమాండ్ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా మండల కేంద్రమైన కోడుమూరులో ఏఐటీయూసీ సిఐటియు రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం తదితర రంగాల కార్మికులు కలిసి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రజా కార్మిక రైతు నల్ల చట్టాలను రద్దు చేయాలని భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు ర్యాలీ స్థానిక సుందరయ్య భవన్ నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు జరిగింది అనంతరం అంబేద్కర్ సర్కిల్ నందు కార్మిక నాయకులు మాట్లాడారు ఈ కార్యక్రమానికి సిఐటియు మండల కార్యదర్శి గఫూర్మియా అధ్యక్షతన జరిగిన సమ్మెకు ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా నాయకులు అబ్దుల్లా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి రాజు సిపిఎం మండల కార్యదర్శి కే రాజు ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీరాములు గౌడ్ పాల్గొన్నారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రజల డబ్బులు కోట్ల రూపాయలు దోచుకుని బడా పెట్టుబడిదారులకు పంచి పెడుతున్నది కార్పొరేట్ల ఒత్తిడితోనే పాలకవర్గం లేబర్ కోర్సును అమల్లోకి తెచ్చింది గతంలో 44 రకాల లేబర్ కోడ్స్ ఉండేవి కార్మికులకు స్వేచ్ఛగా అండగా తమ కోరికలను అడగడానికి పోరాటం చేయడానికి హక్కు ఉండేది ప్రస్తుతం అన్ని చట్టాలను రద్దుచేసి కేవలం నాలుగు చట్టాలుగా మార్చడం జరిగింది ఈ చట్టాల వల్ల దేశంలో ఉన్నటువంటి కార్మికులు తన ఉపాధిని కోల్పోతున్నారు ఈ చట్టం వల్ల కార్మికులు తన హక్కులను పోరాటం చేయడానికి అడ్డంకులు ఏర్పడతాయి ఇప్పటివరకు కార్మికులకు ఈఎస్ఐ వర్తించాలంటే పదిమంది ఒక యజమాని కింద పని చేస్తుందని దానిని 30 మందికి లేబర్ కోడ్స్ గా మార్చారు ఒక కాంట్రాక్టర్ కింద ఇప్పటివరకు 20 మంది కార్మికులు పనిచేస్తే ఈఎస్ఐ పిఎఫ్ బోనస్ కనీస వేతనాలతో సహా అన్ని హక్కులు వర్తించేయి ఇప్పుడు దానిని 50 మంది ఉంటేనే వర్తిస్తాయని చట్టాలు తెచ్చారు అంటే పదిమంది ఉంటే ఎలాంటి హక్కులు అడగకూడదని దుర్మార్గమైన ఆలోచనతో ఈ చట్టాలు తీసుకొచ్చారు అలాగే 10 గంటల విధానం గత బ్రిటిష్ ప్రభుత్వం నుండి పోరాటం చేసి ఎనిమిది గంటలు సాధించుకొని ఇప్పటివరకు అమలు జరిగింది ప్రస్తుతం ఆ విధానాన్ని 12 గంటలకు మార్చారు ఓవర్ టైం కు అదనపు జీతం కూడా చెల్లించకుండా చేశారు ఇప్పటివరకు ట్రేడ్ యూనియన్ రిజిస్ట్రేషన్ చేయాలంటే కనీసం ఏడుగురు కార్మికులు ఉంటే చాలు వారు సొంత యూనియన్ పెట్టుకోవచ్చు అలాంటిది ఇప్పుడు తెచ్చిన చట్టంలో 100 మంది లేదా అంతకు పైగా ఉంటేనే యూనియన్లు పెట్టుకోవాలంటున్నారు అంటే చిన్నపాటి పరిశ్రమలు కార్మికులపై పెత్తనం చెలాయించడానికి ఇది ఒక దారి ఇప్పటివరకు వేతనాలు పెంచుకునే హక్కు కార్మికులకు ఉండేది ప్రస్తుతం కార్మికులు తమ వేతనాలను పెంచమని పోరాటాలు చేసే హక్కు కూడా లేదని చట్టం తీసుకొని వచ్చారు ఇది చాలా దుర్మార్గమైనటువంటి చర్య ఈ నల్ల చట్టాల వల్ల అనేక రాష్ట్రాల్లో ఉన్న సంక్షేమ బోర్డులన్నీ నేడు రద్దు అవుతాయి ఉదాహరణకు కేరళలో 40 సంక్షేమ బోర్డులు తమిళనాడులో 21 సంక్షేమ బోర్డులు ఉన్నాయి ఇలా అన్ని రాష్ట్రాల్లో రకరకాల సంక్షేమ బోర్డులు పనిచేస్తున్నాయి మైన్స్ బీడీ ఉప్పు లాంటి అనేక రంగాలకు ప్రత్యేక సెస్సు ద్వారా కార్మిక సంక్షేమ బోర్డులో నడుస్తున్నాయి విద్యా వైద్యం వివాహం ప్రసూతి వగైరాలకు యాజమాన్యాలు చెల్లించే వేలకోట్ల రూపాయలు సెస్సులు ఇకపై యజమానులు చెల్లించాల్సిన అవసరం యజమానులకు లేదని చట్టం చేశారు ఈ చట్టం బడా పారిశ్రామిక యజమానులకు ప్రయోజనం కలుగుతుంది కార్మికులకు మాత్రం తీరని అన్యాయం జరుగుతుంది అలాగే ఉపాధి హామీ పథకాన్ని ధ్వంసం చేసి ఇప్పటివరకు గ్రామీణ పేదలకు ఉన్న ఉపాధి గ్యారెంటీ పోయింది ప్రాణాలు పోయినా అడిగే దిక్కులేదు మహాత్మా గాంధీ పేరున తీసుకొచ్చిన గ్రామీణ ఉపాధి పథకాన్ని జి రాంజీ పేరు మీద మార్చడం 90 శాతం ఇస్తున్నటువంటి కేంద్ర నిధులను 60 శాతానికి కుదించడం చాలా దుర్మార్గం అంటే గ్రామీణ ప్రజలకు 60 శాతం నిధులతో ఉపాధి ఎలా దొరుకుతుందని నాయకులు అన్నారు వ్యవసాయ రంగంలో అమెరికా రాజ్యానికి తల వంచి మన రైతులు పండించిన పంటకు ఎగుమతి చేస్తే ఒక్క రూపాయి కూడా అగ్రరాజ్యం సంఘం చెల్లించదు అదే అమెరికా నుండి దిగుమతి చేసుకుంటే 18% సుంకం వారి కట్టాలి ఇది చాలా దుర్మార్గమైనటువంటి చర్య భారతదేశంలో ఉన్నటువంటి రైతాంగం మొత్తం పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక తెచ్చిన అప్పులు కట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితికి ఈ ప్రభుత్వం తీసుకొచ్చింది కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నల్ల చట్టాలను రద్దుచేసి ఉపాధి హామీ పథకాన్ని మహాత్మా గాంధీ పేరుతో ప్రారంభించాలని అలాగే కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించి ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యం కల్పించి రైతు వ్యవసాయ కూలీలు కార్మికులు అందరికీ సమన్యాయం చేయాలని వారి డిమాండ్ చేశారు కేంద్ర ప్రభుత్వం ఇలాగే మొండిగా వ్యవహరిస్తే రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు జరుగుతాయని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూలమ్మ అరుణ ఆశ యూనియన్ సుబేదా శ్రీదేవి వీఆర్ఏ సంఘం రాజు చేనేత సంఘం కే లక్ష్మన్న మధ్యాహ్న భోజనం రాముడు వ్యవసాయ కార్మిక సంఘం రామాంజనేయులు బాబయ్య స్కూల్స్ స్కావెంజర్స్ సంగం రమణ ఆవాజ్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ ముస్తఫా యుటిఎఫ్ నాయకులు నవీన్ పాటి వెంకటేశ్వర్లు గ్రామపంచాయతీ కార్మికులు రమేష్ ఎ ఐ టి యు సి మండల కార్యదర్శి మద్దూరు చిన్న రాముడు సిఐటియు మండల అధ్యక్షులు గుజరాతి వీరన్న వీఆర్ఏ సంఘం రాజు వివోఏ సంఘం మారెప్ప మద్దిలేటి మహిళా సంఘం నాయకురాలు సులోచనమ్మ ఆటో యూనియన్ జిల్లా నాయకులు మధు హమాలీ సంఘం నాయకులు సుంకన్న మద్ది నాగరాజు రాము తదితరులు పాల్గొన్నారు







## వృత్తివిద్యా నైపుణ్య శిక్షణలో భాగంగా జివిఆర్ జడ్పిహెచ్ఎస్ విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్

మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లాలోని కోడుమూరు పట్టణంలో గల స్థానిక జివిఆర్ జడ్పిహెచ్ఎస్ విద్యార్థులు వృత్తివిద్యా నైపుణ్య శిక్షణలో భాగంగా ఎలక్ట్రానిక్స్ మరియు హార్డ్వేర్ ట్రేడ్కుకు, సంబంధించిన విద్యార్థులు కోడుమూరు లోని భగీరథ వాటర్ ప్లాంట్ ను సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా వాటర్ ప్లాంట్ నిర్వాహకులు పీతాంబరం మరియు యుగంధర్ వాటర్ ప్యూరిఫికేషన్ ప్రాసెస్ మరియు ఫిల్టర్స్ పని చేయు విధానం, విద్యార్థులకు లకు ప్రత్యక్షంగా వివరించారు ఈ సందర్శనకు అవకాశం కల్పించినందుకు యాజమాన్యానికి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పాఠశాల తరఫున ప్రత్యేకంగా ధన్యవాదములు తెలియజేశారు ఇందులో పాల్గొన్న ఎలక్ట్రానిక్స్ వృత్తి విద్య శిక్షకుడు ఆంజనేయులును పాఠశాల ప్రధానోపాధ్యాయులు జే రామచంద్రుడు గారు ప్రత్యేక అభినందనలను తెలియజేశారు ఇలాంటి ఇండస్ట్రియల్ విజిట్ వలన విద్యార్థులలో ప్రాక్టికల్ బోధనతో పాటు వారి భవిష్యత్తుకు మరింత దోహదపడుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు.




## శ్రీశైలం పాదయాత్రలకు రేడియం జాకెట్స్ పంచిపెట్టిన బెస్త నరసింహులు

మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణ నందు కర్ణాటక నుండి ఎందరో శివ స్వామి మాలదారులు మరియు సాధారణ భక్తులు కోడుమూరు మార్గం గుండా పాదయాత్ర చేసుకుంటూ శ్రీశైలం వెళ్తారు అలా వెళ్లే పాదయాత్రికులకు కోడుమూరు పాపాయి పండు వ్యాపారస్తుడు బెస్త నరసింహులు సహృదయంతో మార్గ మధ్యలో యాత్రికులకు ఎటువంటి ప్రమాదం జరగకుండా ఉండాలని వారు క్షేమంగా శ్రీశైలం వెళ్లాలని మంచి ఉద్దేశంతో వారికి రేడియం జాకెట్స్ ఉచితంగా పంచిపెట్టాడు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్గ మధ్యలో రోడ్డుకు ఇరువైపులా వాహనాల ఎల్ఈడి లైట్ల వెలుతురుకు దారిలో శ్రీశైలం వెళ్లే పాదయాత్రకులు వాహనదారులకు కనపడరని అలా కనపడకపోవడంతో ప్రమాదాలు జరుగుతాయని ఉద్దేశంతో ఈ జాకెట్స్ ఇస్తున్నానని వాహనాల లైట్స్ వెలుతురు ఈ జాకెట్స్ పై పడటంతో అప్పుడు దాంట్లో ఉన్న రేడియం ప్రభావంతో ఆ జాకెట్టు మెరుస్తూ కనబడుతుంది కాబట్టి ఈ జాకెట్ ద్వారా ప్రమాదాలు తగ్గించవచ్చని ఒక మంచి ఉద్దేశంతో మేము పాదయాత్రకు జాకెట్ ఇస్తున్నామని వారి సందర్భంగా తెలియజేశారు ఈ జాకెట్ తీసుకున్న శివ స్వాములు సాధారణ భక్తులు పాదయాత్రలో ఈ జాకెట్ మాకు ఎంతో ఉపయోగపడుతుందని ఈ జాకెట్ ఇచ్చినందుకు బెస్త నర్సింహులుకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో గంగపుత్రులు పాల్గొన్నారు




## నూతన వధూవరులను ఆశీర్వదించిన గుమ్మనూరు నారాయణ

(ఆలూరు మనగళం): కర్ణాటక రాష్ట్రము, బళ్లారి పట్టణం నందు వాల్మీకి భవన్ లో గుమ్మనూరు గ్రామానికి చెందిన దివాకర్ ప్రత్యేక ఆహ్వానం మేరకు గుమ్మనూరు దివాకర్ వారి కుమార్తె వివాహానికి ముఖ్యఅతిథిగా ఆలూరు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో గుమ్మనూరు గ్రామస్తులు మరియు బంధుమిత్రులు పాల్గొన్నారు.





## సమయ సద్వినియోగమే దేశ అభివృద్ధికి బలమైన పునాది

డెస్క్, ఫిబ్రవరి 11 , మన గళం : దేశ ఆర్థికాభివృద్ధి గురించి మాట్లాడేటప్పుడు పెట్టుబడులు, పరిశ్రమలు, సాంకేతికత వంటి అంశాలు ముందుకు వస్తాయి. అయితే వీటన్నింటికీ ప్రాణం పోసేది ఉత్పాదకత. తక్కువ వనరులతో ఎక్కువ ఫలితాలు సాధించే సామర్థ్యమే నిజమైన ఉత్పాదకత. ఈ విలువను గుర్తు చేస్తూ ప్రతి ఏడాది జాతీయ ఉత్పాదకత దినాన్ని పాటిస్తున్నారు. పని సామర్థ్యాన్ని పెంచడం, సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం, దేశ అభివృద్ధిలో ప్రతి వ్యక్తి పాత్రను గుర్తు చేసే రోజు ఇది.

ఉత్పాదకత అనేది కేవలం పరిశ్రమలకే పరిమితం కాదు. కార్యాలయాల్లో, వ్యవసాయ రంగంలో, విద్యాసంస్థల్లో, చిన్న వ్యాపారాల్లో ప్రతి రంగంలో ఇది కీలక అంశం. సమయపాలన, క్రమశిక్షణ, నైపుణ్యాల పెంపు, సాంకేతికత వినియోగం కలిసినప్పుడే ఉత్పాదకత పెరుగుతుంది. ఒక వ్యక్తి పనితీరు మెరుగుపడితే, అది సంస్థకు లాభం. సంస్థ బలపడితే దేశ ఆర్థిక వ్యవస్థకు మద్దతు. పరిశ్రమల దృష్టిలో ఉత్పాదకత అంటే ఉత్పత్తి పెరుగుదల మాత్రమే కాదు. నాణ్యత, సమర్థత, వ్యర్థాల నియంత్రణ కూడా అంతే ముఖ్యం. తక్కువ ఖర్చుతో అధిక నాణ్యత సాధించడం ద్వారా అంతర్జాతీయ మార్కెట్లలో పోటీ సామర్థ్యం పెరుగుతుంది. దేశ ఆర్థిక స్థిరత్వానికి ఇది కీలకం.కార్యాలయాల్లో కూడా ఉత్పాదకత ప్రధాన చర్చగా మారుతోంది. ఉద్యోగులు కేవలం గంటలు గడపడం కాదు, ఫలితాలపై దృష్టి పెట్టాలి. సమయ నిర్వహణ, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, జట్టు భావన ఉత్పాదకతను ప్రభావితం చేస్తాయి. పనివ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యత కూడా పనితీరును మెరుగుపరుస్తుంది. అలసటతో పని చేసే వ్యక్తి కంటే ఉత్సాహంతో పని చేసే వ్యక్తి ఎక్కువ ఫలితాలు ఇస్తాడు. విద్యాసంస్థల్లో ఉత్పాదకత చర్చలు మరింత ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం, లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకోవడం, నైపుణ్యాలను పెంపొందించుకోవడం వంటి అంశాలపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. భవిష్యత్తులో దేశ అభివృద్ధికి తోడ్పడే యువతను తయారు చేయాలంటే, విద్యా వ్యవస్థలోనే ఉత్పాదకత విలువలు నాటాలి. జాతీయ ఉత్పాదకత దినం మనకు ఒక ముఖ్యమైన ప్రశ్నను వేస్తుంది. మనం చేసే ప్రతి పనిలో సమర్థత ఉందా? సమయాన్ని వృథా చేస్తున్నామా? వనరులను సద్వినియోగం చేసుకుంటున్నామా? ఈ ప్రశ్నలకు నిజాయితీగా సమాధానం వెతకడం ద్వారా వ్యక్తిగతంగా, సంస్థల పరంగా, దేశ స్థాయిలో మార్పు సాధ్యమవుతుంది. ఉత్పాదకత అంటే కేవలం ఎక్కువ పని చేయడం కాదు. తెలివిగా పని చేయడం. సమయాన్ని గౌరవించడం. వనరులను కాపాడడం. నైపుణ్యాలను పెంపొందించడం. ఇవన్నీ కలిసినప్పుడే దేశం ఆర్థికంగా బలపడుతుంది. ప్రతి పౌరుడు తన పనిని సమర్థంగా నిర్వహించినప్పుడే జాతీయ స్థాయిలో ఉత్పాదకత పెరుగుతుంది. మొత్తంగా జాతీయ ఉత్పాదకత దినం ఒక రోజు కార్యక్రమంగా మిగలకూడదు. ఇది ప్రతి రోజు ఆచరణగా మారాలి. వ్యక్తిగత క్రమశిక్షణ నుంచి దేశ ఆర్థికాభివృద్ధి వరకు, ఉత్పాదకతే ప్రధాన బలం. సమయాన్ని గౌరవించే సమాజమే అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుంది.

# సంపాదకీయం

## తక్షణ ఆనందాల కోసం దీర్ఘకాల విలువలకు దూరం

ఆధునిక ప్రపంచం మనిషికి ఎన్నో సౌకర్యాలు అందించింది. ఒక క్లిక్‌తో సమాచారం, క్షణాల్లో వినోదం, వెంటనే కొనుగోలు, త్వరిత ఫలితాలు ఇవన్నీ మన జీవన విధానాన్ని పూర్తిగా మార్చేశాయి. ఈ వేగం సౌకర్యాన్ని ఇచ్చినా, అదే వేగం మన ఆలోచనలను కూడా ప్రభావితం చేస్తోంది. ఎదురు చూడలేని తత్వం పెరుగుతోంది. తక్షణ సంతృప్తి పొందాలనే ఆతురత జీవితానికి కేంద్రంగా మారుతోంది. ఈ క్రమంలో మనం క్రమంగా కోల్పోతున్నది దీర్ఘకాల విలువలేనా అన్న ప్రశ్న ఆలోచనాత్మకంగా నిలుస్తోంది. ఒకప్పుడు విజయానికి ఓర్పు అవసరం. సంబంధాలకు సమయం అవసరం. లక్ష్యాలకు కష్టపడటం సహజం. ఇప్పుడు మాత్రం వెంటనే ఫలితం రావాలని ఆశించడం పెరిగింది. క్షణిక ఆనందం కోసం తీసుకునే నిర్ణయాలు, తాత్కాలిక సంతోషం కోసం చేసే రాజీలు శాశ్వత విలువలను దెబ్బతీస్తున్నాయి. మనసు కోరిన వెంటనే అందుబాటులోకి వచ్చే ప్రపంచం మనలో సహనాన్ని తగ్గిస్తోంది. ఈ సహనం కోల్పోతే, సంబంధాలు, లక్ష్యాలు, జీవితం అన్నీ అస్థిరంగా మారే ప్రమాదం ఉంది. సంబంధాల విషయంలో ఈ మార్పు మరింత స్పష్టంగా కనిపిస్తోంది. ఒకప్పుడు కుటుంబం అనేది ఓర్పు, పరస్పర గౌరవం, అర్థం చేసుకోవడంపై నిలబడేది. ఇప్పుడు చిన్న అపార్థం కూడా పెద్ద దూరానికి దారి తీస్తోంది. క్షణిక కోపం, తక్షణ భావోద్వేగం ఆధారంగా తీసుకునే నిర్ణయాలు శాశ్వత అనుబంధాలను విచ్ఛిన్నం చేస్తున్నాయి. సంబంధాలు కష్టమైనవని భావించి, సులభ మార్గాన్ని ఎంచుకోవడం పెరుగుతోంది. ఇది కుటుంబ వ్యవస్థకు సవాలుగా మారుతోంది.వినియోగ సంస్కృతి ఈ పరిస్థితిని మరింత బలపరుస్తోంది. అవసరానికి మించిన కొనుగోళ్లు, సామాజిక పోలికలు, ఇతరుల జీవితాలతో తులన మనలో అసంతృప్తిని పెంచుతున్నాయి. ఉన్నదాన్ని ఆస్వాదించకుండా, మరింత కావాలనే తాపత్రయం పెరుగుతోంది. ఈ తపన సంతృప్తిని తగ్గిస్తోంది. కృతజ్ఞత, మితవ్యయం, పరిమిత జీవన శైలి వంటి విలువలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. ఆనందం అనేది వస్తువులతో కొలవబడే స్థితికి చేరుకుంటోంది. పిల్లలు, యువత ఈ మార్పుల మధ్య పెరుగుతున్నారు. తక్షణ ఫలితాల ప్రపంచంలో వారు ఎదురు చూడడం నేర్చుకోవడం కష్టమవుతోంది. కష్టపడి సాధించడమే విజయం అన్న భావన కంటే, సులభంగా పొందడమే ఆనందమన్న భావన పెరుగుతోంది. దీర్ఘకాల లక్ష్యాలకు కట్టుబడి ఉండే సామర్థ్యం తగ్గిపోతే, భవిష్యత్తు సమాజం స్థిరత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. ఓర్పు, క్రమశిక్షణ, కష్టానికి గౌరవం ఇవన్నీ చిన్నప్పటినుంచే నేర్పాల్సిన విలువలు.తక్షణ ఆనందం తప్పు కాదు. జీవితం సంతోషంగా ఉండాలి. కానీ ఆ ఆనందం కోసం శాశ్వత విలువలను త్యాగం చేయడం సమంజసం కాదు. ఓర్పు లేకపోతే ప్రేమ నిలబడదు. క్రమశిక్షణ లేకపోతే విజయం నిలబడదు. నిబద్ధత లేకపోతే సంబంధాలు నిలబడవు. దీర్ఘకాల దృష్టి లేకపోతే సమాజం దిశ కోల్పోతుంది. సమాజం ఈ సత్యాన్ని గుర్తించాల్సిన సమయం వచ్చింది. వేగం అవసరం, కానీ దిశ కూడా అవసరం. ఆనందం కావాలి, కానీ విలువలతో కూడిన ఆనందం కావాలి. కుటుంబాల్లో సంభాషణలు పెరగాలి. పిల్లలకు ఎదురుచూడడం నేర్పాలి. తక్షణ సంతోషం కంటే శాశ్వత సంతృప్తి గొప్పదని తెలియజేయాలి. వ్యక్తిగత జీవితంలోనూ, సామాజిక జీవితంలోనూ సమతుల్యత సాధించాల్సిన అవసరం ఉంది.మొత్తంగా తక్షణ ఆనందాల కోసం దీర్ఘకాల విలువలను కోల్పోవడం ఒక మౌన సంక్షోభంగా మారుతోంది. సౌకర్యం పెరిగింది, కానీ సహనం తగ్గింది. వస్తువులు పెరిగాయి, కానీ సంతృప్తి తగ్గింది. ఈ విరోధాభాసాన్ని సరిచేసుకోవడం సమాజానికి అత్యవసరం. ఆనందం తాత్కాలికం కావచ్చు, కానీ విలువలు శాశ్వతం. ఆ శాశ్వత విలువలను కాపాడుకుంటూ ముందుకు సాగినప్పుడే జీవితం నిజమైన అర్థాన్ని పొందుతుంది.ఆధునిక ప్రపంచం మనిషికి ఎన్నో సౌకర్యాలు అందించింది. ఒక క్లిక్‌తో సమాచారం, క్షణాల్లో వినోదం, వెంటనే కొనుగోలు, త్వరిత ఫలితాలు ఇవన్నీ మన జీవన విధానాన్ని పూర్తిగా మార్చేశాయి. ఈ వేగం సౌకర్యాన్ని ఇచ్చినా, అదే వేగం మన ఆలోచనలను కూడా ప్రభావితం చేస్తోంది. ఎదురు చూడలేని తత్వం పెరుగుతోంది. తక్షణ సంతృప్తి పొందాలనే ఆతురత జీవితానికి కేంద్రంగా మారుతోంది. ఈ క్రమంలో మనం క్రమంగా కోల్పోతున్నది దీర్ఘకాల విలువలేనా అన్న ప్రశ్న ఆలోచనాత్మకంగా నిలుస్తోంది. ఒకప్పుడు విజయానికి ఓర్పు అవసరం. సంబంధాలకు సమయం అవసరం. లక్ష్యాలకు కష్టపడటం సహజం. ఇప్పుడు మాత్రం వెంటనే ఫలితం రావాలని ఆశించడం పెరిగింది. క్షణిక ఆనందం కోసం తీసుకునే నిర్ణయాలు, తాత్కాలిక సంతోషం కోసం చేసే రాజీలు శాశ్వత విలువలను దెబ్బతీస్తున్నాయి. మనసు కోరిన వెంటనే అందుబాటులోకి వచ్చే ప్రపంచం మనలో సహనాన్ని తగ్గిస్తోంది. ఈ సహనం కోల్పోతే, సంబంధాలు, లక్ష్యాలు, జీవితం అన్నీ అస్థిరంగా మారే ప్రమాదం ఉంది. సంబంధాల విషయంలో ఈ మార్పు మరింత స్పష్టంగా కనిపిస్తోంది. ఒకప్పుడు కుటుంబం అనేది ఓర్పు, పరస్పర గౌరవం, అర్థం చేసుకోవడంపై నిలబడేది. ఇప్పుడు చిన్న అపార్థం కూడా పెద్ద దూరానికి దారి తీస్తోంది. క్షణిక కోపం, తక్షణ భావోద్వేగం ఆధారంగా తీసుకునే నిర్ణయాలు శాశ్వత అనుబంధాలను విచ్ఛిన్నం చేస్తున్నాయి. సంబంధాలు కష్టమైనవని భావించి, సులభ మార్గాన్ని ఎంచుకోవడం పెరుగుతోంది. ఇది కుటుంబ వ్యవస్థకు సవాలుగా మారుతోంది. వినియోగ సంస్కృతి ఈ పరిస్థితిని మరింత బలపరుస్తోంది. అవసరానికి మించిన కొనుగోళ్లు, సామాజిక పోలికలు, ఇతరుల జీవితాలతో తులన మనలో అసంతృప్తిని పెంచుతున్నాయి. ఉన్నదాన్ని ఆస్వాదించకుండా, మరింత కావాలనే తాపత్రయం పెరుగుతోంది. ఈ తపన సంతృప్తిని తగ్గిస్తోంది. కృతజ్ఞత, మితవ్యయం, పరిమిత జీవన శైలి వంటి విలువలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. ఆనందం అనేది వస్తువులతో కొలవబడే స్థితికి చేరుకుంటోంది. పిల్లలు, యువత ఈ మార్పుల మధ్య పెరుగుతున్నారు. తక్షణ ఫలితాల ప్రపంచంలో వారు ఎదురు చూడడం నేర్చుకోవడం కష్టమవుతోంది. కష్టపడి సాధించడమే విజయం అన్న భావన కంటే, సులభంగా పొందడమే ఆనందమన్న భావన పెరుగుతోంది. దీర్ఘకాల లక్ష్యాలకు కట్టుబడి ఉండే సామర్థ్యం తగ్గిపోతే, భవిష్యత్తు సమాజం స్థిరత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. ఓర్పు, క్రమశిక్షణ, కష్టానికి గౌరవం ఇవన్నీ చిన్నప్పటినుంచే నేర్పాల్సిన విలువలు.

## నారా లోకేష్ బాబుకు కృతజ్ఞతలు తెలిపి పాలభిషేకం చేసిన ఉమ్మడి జిల్లా టీడీపీ సీనియర్ నాయకులు

**ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.1,200 కోట్లు విడుదల చేసిన సందర్భంగా విద్యాశాఖ మంత్రివర్యులు శ్రీ నారా లోకేష్ బాబు కృతజ్ఞతలు తెలిపి పాలభిషేకం చేసిన ఉమ్మడి జిల్లా టీడీపీ సీనియర్ నాయకులు నందికొట్కూరు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి శ్రీ గౌరు వెంకట రెడ్డి గారు.**



మనగలం, (కల్లూరు అర్బన్) నేడు పాణ్యశీ నియోజవర్గశీ లో టీడీపీ నాయకులు మరియు విద్యార్థి సంఘం జేఏసీ నాయకులు శ్రీ రాములు గారి ఆధ్వర్యం లో మాధవి నగర్ ఎమ్మెల్యే గారి క్యాంపు కార్యాలయం నుండి అమ్మ హాస్పిటల్ సర్కిల్ వరకు విద్యార్థులతో మరియు కూటమి నాయకులతో కలిసి, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.1,200 కోట్లు విడుదల చేసిన సందర్భంగా విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ గారికి,గౌరు వెంకట రెడ్డి గారు కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గౌరు వెంకట రెడ్డి గారు మాట్లాడుతూ పేద విద్యార్థుల కష్టాలను అర్థం చేసుకొని, వారికి అండగా నిలిచి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయడంలో గౌరవ విద్యాశాఖ మంత్రివర్యులు శ్రీ నారా లోకేష్ గారికి విద్యాపట్ల నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. యువ గళం కార్యక్రమంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ ముందుకు సాగుతున్న ఆయనపై యువతకు మరియు విద్యార్థులకు విశ్వాసం మరింత పెరిగిందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలతో అనేక మంది విద్యార్థులు విద్యను మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితి నుంచి బయటపడ్డారని, వారి భవిష్యత్తుకు ఈ నిర్ణయం గొప్ప భరోసా కల్పించిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం చెప్పింది చెప్పినట్లే చేసి చూపిస్తోందనడానికి ఇది స్పష్టమైన నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తం రెడ్డి,ప్రభాకర్ యాదవ్,బ్రాహ్మణ పల్లె నాగిరెడ్డి,జనార్ధన్ ఆచారి,ఫిరోజ్,కాసాని మహేష్ గౌడ్,జవ్వాజి గంగాధర్ గౌడ్,రాఘవేంద్ర రెడ్డి,రాధాకృష్ణ రెడ్డి, మారెన్న,రామకృష్ణ,మరియు విద్యార్థులు కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ మోడల్ స్కూల్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి

మన గళం బనగానపల్లె : జిల్లా విద్యాశాఖ అధికారి బి జనార్దన్ రెడ్డి బనగానపల్లె ఏపీ మోడల్ స్కూల్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ తనిఖీలో భాగంగా ప్రభుత్వం అందించేటువంటి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి మరియు పిల్లలకు వడ్డించి వారి యొక్క అభిప్రాయాలను తీసుకోవడం జరిగింది తరగతి గదులను అన్నిటిని పరిశీలించి తర్వాత పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు ఈ సమావేశంలో ఉపాధ్యాయులకు గవర్నమెంట్ నిర్దేశించిన 100 రోజుల యాక్షన్ ప్లాన్ ని సమర్థవంతంగా నిర్వర్తించేలా సూచనలు చేశారు ఈ సూచనలలో మొదటగా 10 వ తరగతి విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించాలని సూచించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎంఈఓ లు స్వరూప శ్రీనివాసులు పాఠశాల



ప్రిన్సిపల్ సి.హెచ్.రామలక్ష్మి ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు ఉపాధ్యాయేతర సిబ్బంది మరియు మండల సిఆర్పిలు పాల్గొన్నారు.

## తిరుమల లడ్డూ నెయ్యి టెండర్లలో హెరిటేజ్ ప్రమేయం

**సీఎం సమాధానం చెప్పాలి**



మన గళం కోడుమూరు: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదానికి ఉపయోగించే నెయ్యి కొనుగోలు, టెండర్ల ప్రక్రియలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుటుంబానికి చెందిన హెరిటేజ్ సంస్థ ప్రమేయం ఉందని కోడుమూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇంచార్జి డాక్టర్ ఆదిమూలపు సతీష్ ఆరోపించారు. కర్నూలులోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు డాక్టర్ సతీష్ మాట్లాడుతూ, హెరిటేజ్ సంస్థ వెబ్‌సైట్‌ను పరిశీలిస్తే నారా భువనేశ్వరి ఫోటోతో పాటు 'ఇందాపూర్ డెయిరీ మిల్క్ ప్రొడక్ట్స్' సంస్థను వారి మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌గా చూపుతున్నట్లు తెలిపారు. ఇదే ఇందాపూర్ సంస్థ 2014లో రూ.306 ధరకు సుమారు 16.50 లక్షల కిలోల నెయ్యిని టీటీడీకి సరఫరా చేసినట్లు వెల్లడించారు. అలాగే 2013 నుంచి 2019 మధ్య కాలంలో ప్రీమియర్ డెయిరీ ఆగ్రోఫుడ్స్ సంస్థ కూడా రూ.320, రూ.273, రూ.332 ధరల మధ్య దాదాపు 40 లక్షల కిలోల నెయ్యిని సరఫరా చేసినట్లు సిట్ ఛార్జిషీట్‌లో నమోదు అయ్యిందని గుర్తు చేశారు గతంలో కేజీ నెయ్యి రూ.300 లోపే స్వచ్ఛంగా ఎలా ఇస్తారంటూ ప్రశ్నించిన చంద్రబాబు, తన హయాంలో తక్కువ ధరలకు కొనుగోలు జరిగినప్పుడు ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదని సతీష్ విమర్శించారు. అదే సంస్థ గతంలో రూ.278 ధరకు నెయ్యి సరఫరా చేసినప్పటికీ, ప్రస్తుతం అదే సంస్థ కేజీ ధరను రూ.658కు పెంచి టెండర్లు దాఖలు చేయడం వెనుక అసలు కారణం ఏమిటో వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు 2014లో ఎల్-1గా కర్ణాటక మిల్క్ ఫెడరేషన్, ఎల్-2గా ఇందాపూర్ సంస్థ కలిసి కాంట్రాక్ట్ పొందిన విషయాన్ని గుర్తు చేస్తూ, 2025లో కూడా ఇదే సంస్థలు టెండర్లలో పోటీ పడటం వెనుక భారీ లాలూచీ ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. అధిక లాభాల కోసం నెయ్యి ధరలను కృత్రిమంగా పెంచిన అవకాశాలను కూడా ఆయన ప్రస్తావించారు. హెరిటేజ్ సంస్థ పేరును బయటకు రాకుండా ఇందాపూర్ సంస్థ పేరుతో నెయ్యి సరఫరా జరిగిందని ఆరోపించిన సతీష్, ఈ వ్యవహారంపై సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. హెరిటేజ్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌గా ఉన్న ఇందాపూర్ డెయిరీ ద్వారా జరిగిన లావాదేవీలపై పూర్తి వివరాలు ప్రజలకు తెలియజేయాలని కోరారు. తిరుమల వంటి పవిత్రక్షేత్రానికి సంబంధించిన ప్రసాదాల విషయంలో పారదర్శకత ఉండాలని, భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆదిమూలపు సతీష్ కోరారు. ఈ కార్యక్రమంలో కర్నూలు మండల వైస్ ఎంపీపీ నెహెమియా, జిల్లా ప్రధాన కార్యదర్శి పార్టీ హనుమంత రెడ్డి, సి బెలగల్ మండల కన్వీనర్ సోమశేఖర్ రెడ్డి, కర్నూలు మండల కన్వీనర్ మోహన్ బాబు, కోడుమూరు నియోజకవర్గం ఎస్సీ సెల్ వైయస్సార్‌సీపి అధ్యక్షులు బొజ్జన్న, సామెల్, ప్రభుదాస్, రంగన్న, శ్రీధర్, పాల్గొన్నారు.


## క్షేత్రస్థాయిలో పర్యటించి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ...

మనగళం శ్రీశైలం : నంద్యాల జిల్లాలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీశైలం నందు జరుగుచున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని భక్తుల సౌకర్యాలను మరియు బందోబస్తు ఏర్పాట్ల గురించి తెలుసుకునేందుకు శ్రీశైల క్షేత్రం నందు లడ్డు కౌంటర్, శివాజీ గోపురం, అమ్మవారి దేవాలయం, గుడి లోపలి ప్రదేశంలోనే వివిధ ప్రాంతాలు, నాగుల కట్ట, చంద్రావతి కళ్యాణ మండపం, ఎగ్జి ఎంట్రన్స్, హరిహరరాయ గోపురం,మొదలగు ప్రాంతాలలో పర్యటించి క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఉన్నాయా తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ గారు ఆదేశించారు.



## రైల్వే ప్రయాణికులకు షాకింగ్ న్యూస్.. మార్చి 1 నుంచి ఈ సేవలు బంద్..

న్యూఢిల్లీ ఫిబ్రవరి 12 :మన గళం : రైల్వే ప్రయాణికులకు రైల్వేశాఖ కీలక సూచన జారీ చేసింది. ఇప్పటివరకు అన్‌రిజర్వుడ్, ప్లాట్‌ఫామ్ టికెట్ల బుకింగ్‌తో పాటు ఇతర సేవలు అందించిన యూటీఎస్ యాప్‌ను మార్చి 1 నుంచి దశలవారీగా నిలిపివేయనున్నట్లు ప్రకటించింది. ఈ యాప్ స్థానంలో కొత్తగా రైల్ వన్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. ఇకపై రైల్వేలకు సంబంధించిన అన్ని సేవలు ఒకే వేదికలో అందించాలనే ఉద్దేశంతో రైల్ వన్ యాప్‌ను ప్రవేశపెడుతున్నట్లు అధికారులు తెలిపారు. టికెట్ల బుకింగ్, భోజన సేవలు, రైళ్ల ట్రాకింగ్, ఫిర్యాదులు వంటి సేవలు అన్నీ ఒకేచోట లభించనున్నాయి. ఇప్పటివరకు టికెట్ల కోసం వేర్వేరు యాప్‌లు ఉపయోగించాల్సి వచ్చేది. కొత్త యాప్‌తో ఆ అవసరం ఉండదని పేర్కొన్నారు. మొదటి దశలో యూటీఎస్ యాప్‌లో టికెట్ బుకింగ్, కొత్త వినియోగదారుల నమోదు సేవలను నిలిపివేశారు. ప్లాట్‌ఫామ్ టికెట్ల బుకింగ్, ఆర్ వాలెట్ రీఛార్జ్ వంటి సేవలు కూడా ఇప్పటికే నిలిచిపోయాయి. తాజా వెర్షన్ ఉపయోగిస్తున్న ప్రయాణికులు ఈ సేవలను వినియోగించలేకపోతున్నారు. అయితే యూటీఎస్ యాప్‌లో ఇప్పటికే ఉన్న ఆర్ వాలెట్ బ్యాలెన్స్ సురక్షితంగానే ఉంటుందని రైల్వేశాఖ స్పష్టం చేసింది. ఆ మొత్తాన్ని రైల్ వన్ యాప్‌లో ఉపయోగించుకోవచ్చని తెలిపింది. కొత్త యాప్ ద్వారా అన్‌రిజర్వుడ్, ప్లాట్‌ఫామ్ టికెట్లతో పాటు రిజర్వుడ్ టికెట్ల సేవలు కూడా అందుబాటులో ఉండనున్నాయి.



## రూ. 7,499కే లావా యువ స్టార్ 3 విడుదల



న్యూఢిల్లీ ఫిబ్రవరి 12 :మనగళం: తక్కువ ధరలో మెరుగైన సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో లావా సంస్థ సరికొత్త యువ స్టార్ 3 మొబైల్‌ను భారత మార్కెట్‌లో ప్రవేశపెట్టింది. తక్కువ ఖర్చుతో ఎక్కువ కాలం పనిచేసే బ్యాటరీ, పెద్ద తెర, సరిపడ పనితీరు కోరుకునే వినియోగదారులను దృష్టిలో పెట్టుకుని ఈ మొబైల్‌ను రూపొందించినట్లు సంస్థ తెలిపింది.

ఈ మొబైల్‌లో 6.75 అంగుళాల పరిమాణం గల స్పష్టమైన ప్రదర్శన తెరను అమర్చారు. తెర మరింత సాఫీగా పనిచేయడానికి అధిక తాజాకరణ వేగం అందించారు. శక్తివంతమైన ప్రాసెసర్‌తో ఇది రోజువారీ వినియోగానికి అనుకూలంగా పనిచేస్తుందని కంపెనీ పేర్కొంది.

మెమరీ పరంగా 4 జీబీ పని సామర్థ్య జ్ఞాపకశక్తి, 64 జీబీ నిల్వ సామర్థ్యం అందించారు. తాజా ఆండ్రాయిడ్ ఆధారిత నిర్వహణ వ్యవస్థపై ఈ మొబైల్ పనిచేస్తుంది.

చిత్రీకరణ కోసం వెనుక భాగంలో 13 మెగా పిక్సెల్ ప్రధాన కెమెరా, ముందు భాగంలో 5 మెగా పిక్సెల్ కెమెరా ఏర్పాటు చేశారు. ఎక్కువ సమయం ఉపయోగించుకునేలా 5000 ఎంఏహెచ్ సామర్థ్యమున్న బ్యాటరీను అందించారు.

దుమ్ము, నీటి చిమ్మర్ల నుండి రక్షణ కల్పించే సౌకర్యంతో పాటు భద్రత కోసం పక్క భాగంలో వేలిముద్ర గుర్తింపు వ్యవస్థను ఏర్పాటు చేశారు.

భారతదేశంలో ఈ మొబైల్ ధర రూ. 7,499గా నిర్ణయించగా, మార్చి 2026 నుంచి దేశవ్యాప్తంగా ప్రముఖ విక్రయ కేంద్రాల్లో అందుబాటులోకి రానుంది.

## అన్ని ఖాతాలకు ఒకే పాస్‌వర్డ్.. ఎంత ప్రమాదమో తెలుసా?

హైదరాబాద్ ఫిబ్రవరి 12 :మనగళం: ఇప్పటి డిజిటల్ యుగంలో సామాజిక మాధ్యమాలు, బ్యాంకింగ్, ఈమెయిల్ వంటి అనేక ఖాతాలను వినియోగించడం సాధారణమైంది. అయితే వీటన్నింటికీ ఒకే పాస్‌వర్డ్‌ను ఉపయోగించడం పెద్ద ప్రమాదానికి దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గుర్తుంచుకోవడం సులభంగా ఉండటానికి ఒకే పాస్‌వర్డ్‌ను ఉపయోగించడం సౌకర్యంగా అనిపించినా, అది సైబర్ నేరాలకు అవకాశం కల్పిస్తుంది. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సైబర్ దోస్త్ సంస్థ ఇటీవల చేసిన హెచ్చరికలో, వేర్వేరు ఖాతాలకు ఒకే పాస్‌వర్డ్ ఉపయోగిస్తే డేటా ఉల్లంఘన జరిగినప్పుడు అన్ని ఖాతాలు ఒకేసారి ప్రమాదంలో పడే అవకాశముందని పేర్కొంది. ఒక ఖాతా వివరాలు లీక్ అయితే, అదే పాస్‌వర్డ్‌తో ఉన్న ఇతర ఖాతాలను హ్యాకర్లు సులభంగా లక్ష్యంగా చేసుకునే ప్రమాదం ఉంది. డేటా లీక్ జరిగితే హ్యాకర్లు వ్యక్తిగత వివరాలు, బ్యాంకు సమాచారం వంటి సున్నితమైన సమాచారాన్ని కూడా పొందే అవకాశం ఉంటుంది. దీంతో ఆర్థిక నష్టం, వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది.

మీ వివరాలు డేటా ఉల్లంఘనలో ఉన్నాయా లేదా అనేది ప్రత్యేక వెబ్‌సైట్ల ద్వారా తనిఖీ చేసుకోవచ్చు. ఒకవేళ వివరాలు లీక్ అయినట్లు తెలిసిన వెంటనే అన్ని ఖాతాల పాస్‌వర్డ్‌లను మార్చడం అవసరం. బలమైన పాస్‌వర్డ్ కోసం పెద్ద అక్షరాలు, చిన్న అక్షరాలు, సంఖ్యలు, ప్రత్యేక చిహ్నాల మిశ్రమాన్ని ఉపయోగించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.




సైబర్ భద్రత కోసం ప్రతి ఖాతాకు వేర్వేరు పాస్‌వర్డ్‌లు ఉపయోగించడం, తరచూ మార్చడం, అనుమానాస్పద లింకులను తెరవకుండా జాగ్రత్తపడడం అత్యంత అవసరం.

## బంగారం కిందకు.. వెండి పైకి..



హైదరాబాద్ ఫిబ్రవరి 12 :మనగళం: గత కొన్ని రోజులుగా స్థిరంగా కొనసాగిన బంగారం ధరలు గురువారం తగ్గుముఖం పట్టాయి. మరోవైపు ఇటీవల వరుసగా తగ్గుతూ వచ్చిన వెండి ధరలు మళ్లీ పెరిగాయి. బంగారం ధర గ్రాముకు సుమారు రూ.1200 వరకు తగ్గగా.. వెండి కిలోకు రూ.5000 మేర పెరిగింది. ఫిబ్రవరి 12 ఉదయం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,58,400గా నమోదైంది. ఇది నిన్నటి ధరతో పోలిస్తే రూ.1200 తక్కువ. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,45,200గా ఉండగా, ఇది రూ.1100 తగ్గింది. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,58,550గా, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,45,350గా కొనసాగుతోంది. ఇక వెండి ధరలు గణనీయంగా పెరిగాయి. హైదరాబాద్‌లో కిలో వెండి ధర ప్రస్తుతం రూ.3 లక్షలకు చేరుకుంది. ఢిల్లీలో కిలో వెండి ధర రూ.2.95 లక్షలుగా ఉంది. నిన్నటి ధరతో పోలిస్తే వెండి కిలోకు సుమారు రూ.5000 పెరుగుదల నమోదైంది. బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు అంతర్జాతీయ మార్కెట్ మార్పులు, డాలర్ మారకం విలువ, డిమాండ్ వంటి అంశాలపై ఆధారపడి తరచూ మారుతుంటాయి. కాబట్టి కొనుగోలు చేసే ముందు తాజా ధరలు తెలుసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## మెటాకు షాక్.. వాట్సాప్‌పై నిషేధం విధించిన రష్యా.. ఎందుకు కఠిన నిర్ణయం?

మాస్కో ఫిబ్రవరి 12:మనగళం: రష్యా–అమెరికా కంపెనీల మధ్య ఉద్రిక్తతలు మరింత ముదురుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రముఖ సందేశ యాప్ వాట్సాప్‌పై రష్యా ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ నిబంధనలు పాటించని పక్షంలో పూర్తి స్థాయి నిషేధం విధిస్తామని స్పష్టం చేసింది. ఇప్పటికే కొన్ని సేవలను నిలిపివేసిన రష్యా, తాజాగా వాట్సాప్ సేవలను పూర్తిగా అడ్డుకట్ట వేసినట్లు సమాచారం.

రష్యా కమ్యూనికేషన్ నియంత్రణ సంస్థ రోస్కోమ్నాడ్జోర్ ఆన్‌లైన్ డైరెక్టరీ నుంచి వాట్సాప్‌ను తొలగించినట్లు వార్తలు వచ్చాయి. దేశంలో సుమారు పది లక్షల మందికి పైగా వినియోగదారులు ఈ యాప్‌ను ఉపయోగిస్తున్నట్లు అంచనా. కంపెనీ ప్రతినిధులు స్పందిస్తూ, వినియోగదారులను కలుపుకునే సేవలను కొనసాగించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభమైన తర్వాత అమెరికా కంపెనీలపై రష్యా వరుస ఆంక్షలు విధిస్తోంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'మ్యాక్స్' అనే స్వదేశీ యాప్‌ను ప్రజలు ఎక్కువగా వినియోగించాలని రష్యా ప్రోత్సహిస్తోంది. అయితే పౌరులపై నిఘా పెట్టేందుకు ఈ యాప్‌ను ఉపయోగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

గత ఏడాది వాట్సాప్, టెలిగ్రామ్ కాలింగ్ సేవలను కూడా రష్యా నిషేధించింది. మోసం, ఉగ్రవాదానికి సంబంధించిన సమాచారాన్ని చట్ట అమలు సంస్థలతో పంచుకోవడం లేదనే కారణంతో ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొంది. అంతేకాకుండా ఆపిల్ ఫేస్‌టైమ్, స్నాప్‌చాట్‌లపై కూడా ఆంక్షలు విధించింది.



మెటా సంస్థ రష్యా చట్టాలను పూర్తిగా పాటిస్తే, నిషేధాన్ని పునఃపరిశీలించే అవకాశం ఉందని క్రెమ్లిన్ ప్రతినిధులు తెలిపారు. చట్టాలకు అనుగుణంగా వ్యవహరిస్తూ రష్యా అధికారులతో సంభాషణ ప్రారంభిస్తే రాజీ సాధ్యమవుతుందని సూచించారు. అయితే నిబంధనలు పాటించని పక్షంలో వాట్సాప్‌పై నిషేధం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## స్టాక్ మార్కెట్‌లకు షాకిచ్చిన ఐటీ.. భారీగా నష్టపోయిన సూచీలు

ముంబై ఫిబ్రవరి 12 :మనగళం: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం భారీ నష్టాలతో ముగిశాయి. ముఖ్యంగా ఐటీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో మార్కెట్లపై తీవ్ర ప్రభావం పడింది. అమెరికాలో జనవరి నెలకు సంబంధించిన అంచనాల కంటే మెరుగైన జాబ్స్ డేటా వెలువడడంతో.. ఫెడరల్ రిజర్వ్ త్వరలో వడ్డీ రేట్లు తగ్గించే అవకాశాలు తగ్గాయని భావించిన మదుపర్లు అమ్మకాల వైపు మొగ్గుచూపారు.

దీనికి తోడు ఐటీ రంగాన్ని ఏఐ ప్రభావం మరియు భవిష్యత్ ఆర్డర్లపై ఉన్న అనిశ్చితి వెంటాడింది. ఇటీవల గరిష్ఠ స్థాయిల వద్ద ట్రేడ్ అవుతున్న ఐటీ స్టాక్స్‌లో మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడం కూడా సూచీల పతనానికి కారణమైంది. ఫెడ్ వడ్డీ రేట్లు ఎక్కువ కాలం కొనసాగితే అమెరికన్ కంపెనీలు ఖర్చులను తగ్గించే అవకాశం ఉండటంతో భారత ఐటీ సంస్థలపై ఒత్తిడి పెరుగుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

ఈ నేపథ్యంలో ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, విప్రో వంటి ప్రముఖ ఐటీ కంపెనీల షేర్లు గణనీయంగా పడిపోయాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ దాదాపు 5 శాతం మేర క్షీణించింది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ దాదాపు రూ.3 లక్షల కోట్లు తగ్గినట్లు అంచనా. సెన్సెక్స్ గురువారం 83,968.43 పాయింట్ల వద్ద నష్టాలతో ప్రారంభమై రోజంతా ఒత్తిడిలోనే కొనసాగింది. ఇంట్రాడేలో 83,516.67 పాయింట్ల కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 558.72 పాయింట్లు కోల్పోయి 83,674.92 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 146.65 పాయింట్ల నష్టంతో 25,807.20 వద్ద స్థిరపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 90.61 వద్ద కొనసాగింది. సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. మరోవైపు బజాజ్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, ట్రెంట్, బీఈఎల్, ఎస్‌బీఐ షేర్లు లాభాల్లో నిలిచాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 69 డాలర్ల వద్ద ఉండగా, బంగారం ఔన్సు ధర 5064 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది.



మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# రాజా సాబ్ బ్యూటీ రిద్ధి కుమార్ అదరగొట్టిందిగా..!



హైదరాబాద్, ఫిబ్రవరి 12 :మనగళం: తెలుగు సినీ ప్రేక్షకులకు "లవర్" సినిమాతో పరిచయమైన రిద్ధి కుమార్, తన తొలి చిత్రంతోనే అందంఅభినయాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. రాజ్ తరుణ్ సరసన కథానాయికగా నటించిన ఈ ముద్దుగుమ్మ, ఆ మూవీలో తన సహజమైన నటనతో ఆకట్టుకుంది. మొదటి సినిమాతోనే యువ ప్రేక్షకుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది.ఆ తర్వాత కొంతకాలం గ్యాప్ తీసుకున్న రిద్ధి, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన "రాధేశ్యామ్" చిత్రంలో కీలక పాత్రలో కనిపించింది. సినిమాలో అర్చరీ ప్లేయర్‌గా తళుక్కున మెరిసిన ఆమె పాత్ర చిన్నదైనా, తన స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. పెద్ద ప్రాజెక్ట్‌లో భాగమవడం ఆమె కెరీర్‌కు మంచి మైలురాయిగా నిలిచింది.

ఇటీవల విడుదలైన "రాజా సాబ్" చిత్రంలో కూడా రిద్ధి కనిపించింది. ఈ సినిమాలో తన గ్లామర్‌తో పాటు నటనతోనూ మెప్పించింది. అయితే సినిమాకు మిక్స్ టాక్ రావడంతో ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయింది. సినిమా భారీ హిట్ అయ్యి ఉంటే రిద్ధి కుమార్‌కు తెలుగులో మరిన్ని పెద్ద అవకాశాలు దక్కేవని సినీ వర్గాలు భావిస్తున్నాయి.కేవలం తెలుగు మాత్రమే కాకుండా హిందీ, మరాఠీ, మలయాళ భాషల్లోనూ వెబ్ సిరీస్‌లు, సినిమాల్లో నటిస్తూ తన ప్రతిభను చాటుకుంటోంది రిద్ధి. కంటెంట్‌కు ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంపిక చేసుకుంటూ, నెమ్మదిగా కానీ స్థిరంగా తన కెరీర్‌ను నిర్మించుకుంటోంది.ఇక సోషల్ మీడియాలో రిద్ధి చాలా యాక్టివ్. తరచూ ఫోటోషూట్లతో అభిమానులను ఆకట్టుకుంటోంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫొటోలు నెటిజన్లను ఆకర్షిస్తున్నాయి. ట్రెండీ అవుట్‌ఫిట్స్, స్టైలిష్ లుక్స్‌తో మెరిసిపోతూ ఫ్యాషన్ స్టేట్‌మెంట్ ఇస్తోంది. సినిమా ఫలితాలు ఎలా ఉన్నా, తన టాలెంట్‌పై నమ్మకం ఉంచుకుని ముందుకు సాగుతున్న రిద్ధి కుమార్ భవిష్యత్తులో మరిన్ని మంచి అవకాశాలతో ప్రేక్షకులను మెప్పించాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# డైరెక్టర్‌గా వరలక్ష్మి శరత్‌కుమార్..

## 'సరస్వతి'తో కొత్త ప్రయోగం

చెన్నై, ఫిబ్రవరి 12, మనగళం: కోలీవుడ్ నటి వరలక్ష్మి శరత్‌కుమార్ తన సినీ ప్రయాణంలో కొత్త అడుగు వేస్తూ దర్శకురాలిగా మెగాఫోన్ పట్టారు. ఇప్పటివరకు వెండితెరపై పవర్‌ఫుల్ పాత్రలతో ప్రేక్షకులను మెప్పించిన ఆమె, ఇప్పుడు స్వీయ దర్శకత్వంలో 'సరస్వతి' అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. తాజాగా విడుదలైన ప్రమోషనల్ వీడియో సోషల్ మీడియాలో మంచి స్పందనను అందుకుంది. ఈ వీడియోలో వరలక్ష్మి ద్విపాత్రాభినయం చేస్తూ ఒకవైపు కఠినమైన దర్శకురాలిగా, మరోవైపు నటిగా కనిపించారు. షూటింగ్ సెట్స్‌లో జరిగే సరదా సంఘటనలను వినోదాత్మకంగా చూపిస్తూ సినిమాపై ఆసక్తిని పెంచేలా రూపొందించారు. హై కాన్సెప్ట్ ఇన్టెన్స్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం రూపొందుతోంది. వరలక్ష్మి తన సోదరి పూజా శరత్‌కుమార్‌తో కలిసి 'దోస డైరీస్' బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో ప్రకాశ్ రాజ్, ప్రియమణి, నవీన్ చంద్ర కీలక పాత్రలు పోషిస్తున్నారు. సంగీత దర్శకుడు ఎస్.ఎస్. తమన్ సంగీతం అందిస్తున్నారు. తొలి సినిమా అయినప్పటికీ కేవలం 30 రోజుల్లో షూటింగ్ పూర్తి చేసి వరలక్ష్మి తన దర్శకత్వ నైపుణ్యాన్ని చూపించారని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. టైటిల్ లోగోలో 'x' అక్షరాన్ని ఎరుపు రంగులో హైలైట్ చేయడం కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్న ఈ చిత్రానికి సంబంధించిన విడుదల తేదీని త్వరలోనే ప్రకటించనున్నారు.




# ప్రేమించి పెళ్లి.. 16 రోజుల్లోనే విడాకులు.. ఈ హీరోయిన్ కథ తెలుసా?



హైదరాబాద్, ఫిబ్రవరి 12, మనగళం: సినిమా ఇండస్ట్రీలో ప్రేమ, పెళ్లి, విడాకులు కొత్త విషయం కాదు. కెరీర్‌లో సక్సెస్ అందుకుంటున్న సమయంలోనే పెళ్లి చేసుకుని, కొన్ని కారణాల వల్ల తక్కువ సమయంలోనే విడిపోయిన జంటలు కూడా చాలానే ఉన్నాయి. ముఖ్యంగా హీరోయిన్స్ విషయంలో ఈ తరహా సంఘటనలు తరచూ చర్చనీయాంశమవుతుంటాయి. పెళ్లి తర్వాత సినిమాలకు గుడ్‌బై చెప్పినవారూ ఉన్నారు, విడాకుల తర్వాత మళ్లీ కెరీర్‌పై ఫోకస్ పెట్టి విజయాలు అందుకున్నవారూ ఉన్నారు. అలాంటి కథనే కలిగిన హీరోయిన్ ఎస్తర్ నోరోన్హా. కన్నడ, తెలుగు చిత్రాల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఎస్తర్ నోరోన్హా, కెరీర్ మంచి స్థాయిలో ఉన్న సమయంలో ప్రేమ వివాహం చేసుకుంది. 2019 జనవరిలో గాయకుడు, నటుడు నోయెల్ సీన్‌ను ఆమె పెళ్లి చేసుకుంది. ఈ జంట వివాహం అప్పట్లో సినీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అయితే పెళ్లైన కొద్ది రోజులకే ఇద్దరి మధ్య మనస్పర్థలు తలెత్తినట్లు వార్తలు వచ్చాయి. ఆ విభేదాలు పెరిగి, చివరకు కేవలం 16 రోజుల్లోనే ఈ జంట విడాకులు తీసుకోవడం అభిమానులను ఆశ్చర్యానికి గురి చేసింది. విడాకుల తర్వాత కొంతకాలం సినిమాలకు దూరంగా ఉన్న ఎస్తర్, తిరిగి తన కెరీర్‌పై దృష్టి పెట్టింది. హీరోయిన్‌గా మాత్రమే కాకుండా, కథకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంపిక చేసుకుంటూ ముందుకు సాగుతోంది. ఇటీవల విడుదలైన కొన్ని చిత్రాల్లో ఆమె బోల్డ్ మరియు డిఫరెంట్ పాత్రల్లో కనిపించి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. పాత్రకు అనుగుణంగా తనను తాను మార్చుకుంటూ నటిగా కొత్త కోణాన్ని చూపిస్తోంది. ఇక సోషల్ మీడియాలో కూడా ఎస్తర్ నోరోన్హా చాలా యాక్టివ్‌గా ఉంటుంది. తన సినిమా అప్‌డేట్స్‌తో పాటు వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను అభిమానులతో పంచుకుంటూ మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంది. ప్రస్తుతం ఆమె పలు ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉండగా, భవిష్యత్తులో మరిన్ని ఆసక్తికరమైన పాత్రల్లో కనిపించనుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. వ్యక్తిగత జీవితంలో ఎదురైన కష్టాలను పక్కనపెట్టి, మళ్లీ కెరీర్‌ను నిలబెట్టుకోవడం ద్వారా ఎస్తర్ నోరోన్హా తన పట్టుదలను చాటుకుంటోంది.

# విజయ్ రష్మిక పెళ్లి వీడియో డీల్?

- ఓటీటీలకు 'నో' చెప్పిన రౌడీ హీరో!



హైదరాబాద్, ఫిబ్రవరి 12, మనగళం: టాలీవుడ్‌లో మోస్ట్ క్రేజీ జంటగా అభిమానుల్లో గుర్తింపు పొందిన విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న పెళ్లి వార్తలు గత కొద్దిరోజులుగా ఫిల్మ్ నగర్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ నేపథ్యంలో వీరి వివాహానికి సంబంధించిన వీడియో స్ట్రీమింగ్ హక్కుల కోసం ఒక అంతర్జాతీయ ఓటీటీ సంస్థ భారీ మొత్తాన్ని ఆఫర్ చేసినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే ఆ ఆఫర్‌ను విజయ్ దేవరకొండ సున్నితంగా తిరస్కరించినట్లు సమాచారం.

గతంలో కొన్ని స్టార్ జంటల వివాహ వీడియోల విషయంలో ఎదురైన న్యాయపరమైన సమస్యలు, విడుదల ఆలస్యాలు వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారని టాక్ వినిపిస్తోంది. వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ముఖ్యమైన వేడుకను వ్యాపారంగా మార్చడం ఇష్టం లేకపోవడంతోనే ఈ ఆఫర్‌ను అంగీకరించలేదని సన్నిహిత వర్గాలు చెబుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. తమ వివాహాన్ని అత్యంత ప్రైవేట్‌గా, కుటుంబ సభ్యులు మరియు ఆత్మీయుల మధ్య జరుపుకోవాలనే ఆలోచనలో ఉన్నారని తెలుస్తోంది.

తాజా ప్రచారం ప్రకారం, ఫిబ్రవరి 26, 2026న రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో వీరి వివాహం జరగవచ్చని సోషల్ మీడియాలో వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఏర్పాట్లకు సంబంధించిన కొన్ని వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అయితే ఈ విషయాలపై విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు.

ఏదేమైనా, ఈ వార్తలు అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తుండగా, అధికారిక ప్రకటన కోసం సినీ వర్గాలు, అభిమానులు ఎదురుచూస్తున్నారు.

## అంపైర్ నిర్ణయంపై నిరసన..



ముంబై ఫిబ్రవరి 12 :మన గళం : పొట్టి ప్రపంచకప్‌లో బోణీ కోసం ఎదురుచూస్తున్న అఫ్గనిస్థాన్ జట్టుకు మరో షాక్ తగిలింది. దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో అంపైర్ నిర్ణయంపై నిరసన వ్యక్తం చేసిన సీనియర్ ఆల్‌రౌండర్ మొహమ్మద్ నబీపై అంతర్జాతీయ క్రికెట్ మండలి భారీ జరిమానా విధించింది. నియమావళి ఉల్లంఘించినందుకు మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత విధించడంతో పాటు ఒక డీమెరిట్ పాయింట్ కూడా కేటాయించారు. దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో 14వ ఓవర్ సమయంలో నబీ అంపైర్ నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తం చేశాడు. బౌలర్ చేతికి ఉన్న బ్యాండ్‌పై అభ్యంతరం తెలుపుతూ అంపైర్‌తో వాగ్వాదానికి దిగాడు. ఈ ఘటనపై మ్యాచ్ రిఫరీ క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదు చేయగా, నబీ లెవల్–1 తప్పిదానికి పాల్పడినట్లు గుర్తించారు. అనంతరం తన తప్పును నబీ అంగీకరించడంతో జరిమానాతో సరిపెట్టారు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే అఫ్గనిస్థాన్ జట్టు పోరాడినా విజయం సాధించలేకపోయింది. 187 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో రహ్మనుల్లా గుర్బాజ్ అద్భుతంగా బ్యాటింగ్ చేసి స్కోరు సమం చేశాడు. సూపర్ ఓవర్‌లోనూ ఇరుజట్లు సమంగా నిలవడంతో రెండో సూపర్ ఓవర్‌లో ఫలితం తేలింది. చివరి బంతికి గుర్బాజ్ అవుట్ కావడంతో అఫ్గనిస్థాన్ పరాజయం పాలైంది. వరుసగా రెండు ఓటములతో రషీద్ ఖాన్ సారథ్యంలోని జట్టు తదుపరి దశ అవకాశాలను క్లిష్టం చేసుకుంది.

## ప్రపంచకప్‌లో తొలి అర్ధ శతకం..



ముంబై,ఫిబ్రవరి 12 :మన గళం : పొట్టి ప్రపంచకప్‌లో చిన్న జట్లు సంచలన ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నాయి. విశ్వ వేదికపై పెద్ద జట్లకు షాక్ ఇవ్వాలనే లక్ష్యంతో పసికూన జట్లు సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. ఈ క్రమంలో ఒమన్ జట్టు ఆటగాడు మొహమ్మద్ నదీమ్ చరిత్ర సృష్టించాడు. ప్రపంచకప్‌లో అర్ధ శతకం సాధించిన అత్యధిక వయస్కుడిగా రికార్డు నెలకొల్పాడు. శ్రీలంకతో జరిగిన గ్రూప్ బీ మ్యాచ్‌లో సహచరులు వరుసగా అవుట్ అవుతున్నా నదీమ్ క్రీజులో నిలదొక్కుకుని అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. ప్రత్యర్థి పేస్, స్పిన్ దాడిని సమర్థంగా ఎదుర్కొంటూ అజేయంగా అర్ధ శతకం పూర్తి చేశాడు. ఈ ప్రదర్శనతో ప్రపంచకప్ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాడు. గురువారం నాటికి నదీమ్ వయసు 41 సంవత్సరాలు 161 రోజులు. దీంతో శ్రీలంక మాజీ దిగ్గజం సనత్ జయసూర్య పేరిట ఉన్న రికార్డు చెరిపేశాడు. 2009 సీజన్‌లో వెస్టిండీస్‌పై జయసూర్య 39 సంవత్సరాలు 345 రోజుల్లో అర్ధ శతకం సాధించి రికార్డు నెలకొల్పాడు. ప్రస్తుతం జయసూర్య శ్రీలంక జట్టుకు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే తొలి పోరులో జింబాబ్వే చేతిలో ఓడిన ఒమన్, శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో కూడా పరాజయం చవిచూసింది. ముందుగా బ్యాటింగ్ చేసిన శ్రీలంక 225 పరుగులు చేసింది. భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఒమన్ బ్యాటర్లు విఫలమయ్యారు. నదీమ్ అజేయంగా 53 పరుగులు చేయగా, వసీం అలీ 27 పరుగులు చేశాడు. మిగతా బ్యాటర్లు విఫలమవడంతో ఒమన్ 120 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో శ్రీలంక 105 పరుగుల తేడాతో విజయం సాధించి గ్రూప్ బీలో అగ్రస్థానంలో నిలిచింది.

## పాకిస్థాన్‌తో వివాదం..

### పీఎస్ఎల్ వేలానికి అఫ్గానిస్తాన్ ఆటగాళ్లు దూరం




లాహోర్ ఫిబ్రవరి 12 :మన గళం : పాకిస్థాన్ సూపర్ లీగ్ పదకొండో సీజన్‌కు ముందు నిర్వహించిన వేలంలో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. అఫ్గానిస్తాన్‌కు చెందిన పలువురు క్రికెట్ ఆటగాళ్లు చివరి నిమిషంలో తమ పేర్లను వేలం నుంచి ఉపసంహరించుకున్నారు. రెండు దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలే దీనికి ప్రధాన కారణమని సమాచారం. ముజీబుర్ రెహ్మాన్, మహ్మద్ నబీ, ఫజల్ హక్ ఫారూఖీ, సిద్దికుల్లా అతల్, వకార్ సలామ్‌ఖేల్ వంటి ఆటగాళ్లు తొలుత వేలానికి నమోదు అయినట్లు లీగ్‌కు చెందిన ఒక జట్టు యజమాని వెల్లడించారు. అయితే పేషావర్ జల్మీ జట్టు రహ్మనుల్లా గుర్బాజ్‌ను నేరుగా జట్టులోకి తీసుకోవడంతో సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వెల్లువెత్తాయి. దీనితో గుర్బాజ్ స్వయంగా లీగ్ నుంచి తప్పుకున్నాడు. అనంతరం మిగతా అఫ్గాన్ ఆటగాళ్లు కూడా వివాదాలకు దూరంగా ఉండాలనే ఉద్దేశంతో తమ పేర్లను వెనక్కి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా లీగ్ ప్రధాన కార్యనిర్వాహణ అధికారి సల్మాన్ నసీర్ మాత్రం భిన్నంగా స్పందించారు. వేలంలో కొంత మంది అఫ్గాన్ ఆటగాళ్లు ఉన్నప్పటికీ, ఏ జట్టూ వారిని ఎంపిక చేసేందుకు ఆసక్తి చూపలేదని తెలిపారు. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు కూడా దీనికి కారణం అయ్యి ఉండొచ్చని అన్నారు. గత ఏడాది పాకిస్థాన్ సైన్యం అఫ్గానిస్తాన్‌లోని కొన్ని ప్రాంతాలపై వైమానిక దాడులు జరిపిన తరువాత రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత ఉద్రిక్తంగా మారాయి. ఈ పరిణామాల నేపథ్యంలో అఫ్గాన్ ఆటగాళ్ల ఉపసంహరణ క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## ఆ ట్రోఫీ గెలవడమే నా లక్ష్యం: రోహిత్ శర్మ

ముంబై ఫిబ్రవరి 12 :మన గళం : భారత జట్టు అనుభవజ్ఞుడు రోహిత్ శర్మ టెస్టు, టీ20 రూపాలకు వీడ్కోలు పలికి ప్రస్తుతం ఒకరోజు అంతర్జాతీయ మ్యాచ్‌లపైనే దృష్టి సారించిన విషయం తెలిసిందే. 2027లో జరగనున్న ప్రపంచ కప్‌ను గెలవాలనే లక్ష్యంతోనే ముందుకు సాగుతున్నానని రోహిత్ శర్మ స్పష్టం చేశాడు.ప్రపంచ కప్‌పై తనకు చిన్నప్పటి నుంచే ప్రత్యేకమైన అభిమానం ఉందని రోహిత్ తెలిపాడు. “నా దేశం కోసం ప్రపంచ కప్ గెలవాలని కోరుకుంటున్నాను. చిన్నప్పటి నుంచి ప్రపంచ కప్ మ్యాచ్‌లు చూస్తూ పెరిగాను. నాలుగేళ్లకు ఒకసారి జరిగే ఈ టోర్నీకి ఎంతో ప్రాధాన్యం ఉంది. ప్రస్తుతం ఆ ట్రోఫీ గెలవడమే నా లక్ష్యం. దాని కోసం పూర్తి స్థాయిలో శ్రమిస్తాను” అని ఒక అంతర్జాతీయ క్రికెట్ మండలి కార్యక్రమంలో పేర్కొన్నాడు. ఇదిలా ఉండగా ఇటీవల భారత క్రికెట్ నియంత్రణ మండలి ఆటగాళ్ల వార్షిక ఒప్పందాల జాబితాను ప్రకటించింది. ఇందులో రోహిత్ శర్మ అత్యున్నత వర్గం నుంచి బి వర్గానికి మారాడు. అత్యున్నత వర్గాన్ని తొలగించిన మండలి ప్రస్తుతం ఏ, బి, సి వర్గాలుగా మాత్రమే విభజించింది. ఏ



వర్గంలో శుభ్‌మన్ గిల్, జస్ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా చోటు దక్కించుకోగా, విరాట్ కోహ్లీ కూడా బి వర్గంలో కొనసాగుతున్నాడు.

## 105 రన్స్ తేడాతో శ్రీలంక గ్రాండ్ విక్టరీ



పల్లెకెలి ఫిబ్రవరి 12 :మన గళం : టీ20 వరల్డ్‌కప్‌లో శ్రీలంక జట్టు అద్భుత ప్రదర్శన కొనసాగిస్తోంది. ఇవాళ ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో 105 రన్స్ తేడాతో ఘన విజయం సాధించి టోర్నీలో తమ రెండో విజయాన్ని నమోదు చేసింది. గ్రూప్ బీ మ్యాచ్‌గా జరిగిన ఈ పోరులో లంక బ్యాటర్లు, బౌలర్లు సమిష్టిగా రాణించారు.

మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి భారీగా 225 పరుగులు చేసింది. టాప్ ఆర్డర్ బ్యాటర్లు దూకుడుగా ఆడుతూ ఒమన్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. కుశాల్ మెండిస్ 45 బంతుల్లో 61 పరుగులు చేసి ఇన్నింగ్స్‌కు బలమైన పునాది వేశారు. అనంతరం కెప్టెన్ దసున్ శనక కేవలం 20 బంతుల్లోనే 50 పరుగులు చేసి మెరుపు హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. పవన్ రత్ననాయకే కూడా 28 బంతుల్లో 60 పరుగులు చేసి స్కోరు 200 దాటేలా చేశాడు.

భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఒమన్ జట్టు శ్రీలంక బౌలర్ల దాడికి తట్టుకోలేకపోయింది. నిర్ణీత ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి కేవలం 120 పరుగులు మాత్రమే చేసింది. ఒమన్ తరఫున నదీమ్ 53 పరుగులతో పోరాడగా, వాసిమ్ అలీ 27 పరుగులు చేశాడు.

బౌలింగ్‌లో దుష్మంత చమీరా, మహేశ్ తీక్షణ చెరో రెండు వికెట్లు తీసుకుని ఒమన్ బ్యాటింగ్ లైనప్‌ను కుదేలు చేశారు. మిగతా బౌలర్లు కూడా కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి ప్రత్యర్థికి అవకాశం ఇవ్వలేదు.

ఈ విజయంతో శ్రీలంక గ్రూప్ బీ పాయింట్ల పట్టికలో బలమైన స్థానాన్ని సంపాదించింది. వరుసగా రెండో విజయం నమోదు చేయడంతో జట్టు ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది.

## ముంబైలో ఏదో తిన్నాడు.. సడెన్‌గా బరువు తగ్గిన అభిషేక్ శర్మ

ముంబై, ఫిబ్రవరి 12 :మన గళం : టీమిండియా యువ బ్యాటర్ అభిషేక్ శర్మ ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చేరి తాజాగా డిశ్చార్జ్ అయిన విషయం తెలిసిందే. కడుపు ఇన్‌ఫెక్షన్ కారణంగా అతను టీ20 వరల్డ్‌కప్‌లో నమీబియాతో జరిగిన మ్యాచ్‌కు దూరమయ్యాడు. ప్రస్తుతం అతని ఆరోగ్యం మెరుగుపడుతున్నప్పటికీ, పాకిస్థాన్‌తో జరిగే తదుపరి మ్యాచ్‌లో ఆడతాడా లేదా అన్నది ఇంకా స్పష్టత లేదు. సమాచారం ప్రకారం, ముంబైలోని వాంఖడే స్టేడియంలో ప్రాక్టీస్ సెషన్ సమయంలో ఏదో తినడం వల్ల అభిషేక్‌కు కడుపు సమస్యలు ప్రారంభమైనట్లు గుర్తించారు. తీవ్ర స్థాయి గ్యాస్ట్రో ఇన్‌ఫెక్షన్ కారణంగా అతను బలహీనంగా మారాడు. అయినప్పటికీ అమెరికాతో జరిగిన మ్యాచ్‌లో జట్టుకు ఉపయోగపడాలని ప్రయత్నించి బ్యాటింగ్‌కు దిగాడు. అయితే ఒక్క బంతి మాత్రమే ఆడి ఔటయ్యాడు. ఆ రోజు సాయంత్రానికి అతని ఆరోగ్యం మరింత క్షీణించడంతో వైద్య పరీక్షలు నిర్వహించారు. వాతావరణ మార్పులు, కడుపు ఇబ్బందులు కలిసి అతనికి అధిక జ్వరం వచ్చింది. తీవ్ర డీహైడ్రేషన్ కారణంగా శరీరంలో ద్రవాలు అధికంగా కోల్పోయినట్లు వైద్యులు గుర్తించారు. తక్కువ సమయంలోనే అతను గణనీయంగా బరువు తగ్గినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. దీంతో అతన్ని ఢిల్లీలోని గంగారామ్ ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందించారు. బీసీసీఐ వర్గాల సమాచారం ప్రకారం, ప్రస్తుతం అతని పరిస్థితి స్థిరంగా ఉంది. పూర్తి ఫిట్‌నెస్ సాధించిన తర్వాతే జట్టులోకి తిరిగి తీసుకునే అవకాశం ఉంది. అభిషేక్ శర్మ త్వరగా కోలుకుని మళ్లీ జట్టులోకి రావాలని అభిమానులు ఆశిస్తున్నారు.



## ఐపీఎల్‌కు ఎన్నికల సెగ.. 19వ సీజన్ షెడ్యూల్ ఆలస్యం..!

ముంబై ఫిబ్రవరి 12 :మన గళం : ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్ షెడ్యూల్ విడుదలపై ఇంకా స్పష్టత రాకపోవడంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. వేలం ప్రక్రియ ముగిసి దాదాపు రెండు నెలలు గడిచినా, ఇప్పటివరకు పూర్తి షెడ్యూల్ ప్రకటించకపోవడం వెనుక ప్రధాన కారణం అసెంబ్లీ ఎన్నికలేనని బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి. సాధారణంగా ఫిబ్రవరి తొలి వారంలోనే మ్యాచ్‌ల తేదీలు, వేదికలు వెల్లడిస్తారు. అయితే ఈసారి పరిస్థితులు భిన్నంగా మారాయి. ప్రతీ ఏడాది మార్చి చివరి వారంలో ప్రారంభమై మే నెల చివరి వరకు సాగే ఐపీఎల్ టోర్నీ ఈసారి కూడా అదే సమయంలో నిర్వహించే అవకాశాలు ఉన్నాయని సమాచారం. మార్చి 26 నుంచి మే 31 వరకు సీజన్ కొనసాగవచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి. కానీ ఎన్నికల తేదీలు, ఓట్ల లెక్కింపు రోజులు ఇంకా ఖరారు కాకపోవడంతో మ్యాచ్‌ల నిర్వహణపై స్పష్టత లేకుండా పోయింది. ముఖ్యంగా భద్రతా ఏర్పాట్ల విషయంలో పెద్ద సవాళ్లు ఎదురవుతున్నాయి.



Printed,edited,published and owned by Nagaruru Raghavendra, Printed At : Global Printers, D.No 10 MIE Industrial Estate, Kallur, Kurnool. AP. Published From H.NO.45/139, Narasimha Reddy Nagar, Kurnool-518004.A.P. Mobile Number : 9160686078. RNI NO. AP TEL/2007/74310.